ప్రజాశక్తి

సోమవారం 24 జూన్ 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

అమెరికాలో దుండగుడు కాల్పులు

కర్లపాలెం యువకుడు మృతి



గోపికృష్ణ (ఫైల్)

ప్రజాశక్తి - కర్లపాలెం

అమెరికాలో దుండగుడు జరిపిన కాల్పుల్లో బాపట్ల జిల్లా, కర్లపాలెం మండలం యాజలి గ్రామానికి చెందిన దాసరి గోపి కృష్ణ (32) అనే యువకుడు మృతి చెందాడు. అందిన వివరాల ప్రకారం... యాజలి గ్రామానికి దాసరి శ్రీనివాసరావు, ధనలక్ష్మి దంపతుల ఏకైక సంతానం గోపి కృష్ణ. వీరిది చిన్న రైతు కుటుంబం. శ్రీనివాసరావు, ధనలక్ష్మి దంపతులు గోపీ కృష్ణను బిటెక్ చదివించారు. అనంతరం గోపి కృష్ణ హైదరాబాద్‌లో ఉద్యోగంలో చేశారు. అనంతరం సాఫ్‌వేరే ఉద్యోగం కోసం 8 నెలల క్రితం అమెరికా (డల్లాస్)కు వెళ్లాడు. ప్రస్తుతం అక్కడ పార్ట్ టైం జాబ్‌గా సూపర్ మార్కెట్‌లో పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్న సమయంలో గోపీ కృష్ణ క్యాష్ కౌంటర్‌లో ఉండగా ఓ దుండగుడు వచ్చి నేరుగా తుపాకీతో అతనిపై కాల్పులు జరిపాడు. తీవ్ర గాయాలతో గోపి కృష్ణ అక్కడిక్కడే కుప్పకూలిపోయాడు. అనంతరం గోపి కృష్ణను హాస్పిటల్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నాడు. గోపి కృష్ణ మృతితో యాజలిలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం.

అమెరికా (డల్లాస్)లో యాజలి యువకుడు దారుణ హత్యకు గురైన ఘటనపై ▶ 2లో

జిల్లా అభివృద్ధికి చర్యలు

- జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ
- ప్రారంభం కాని రూ.26 కోట్ల పనులు రద్దు చేస్తూ తీర్మానం



మాట్లాడుతున్న జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో జిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన స్థాయీ సంఘాల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాడిపర్తి చంద్రశేఖర్, జడ్‌పిటిసిలు పాల్గొన్నారు. 2వ స్థాయీ సంఘం గ్రామీణాభివృద్ధి, 1,7 సంఘాలైన పనులు, ఆర్థిక విషయాలపై సమీక్షించారు. 3,4 స్థాయీ సంఘాలైన వ్యవసాయం, విద్య వైద్యం, 5,6 సంఘాలైన స్త్రీ, శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమంపై విస్తృతంగా చర్చించారు. ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సంతృప్తికరమైన సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ నియోజక వర్గంలో పెండింగ్‌లో ఉన్న పైపులైన్ నిర్మాణ పనులకు ప్రతిపాదనలు ఇస్తే ప్రభుత్వం నుంచి అను మతులు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలో ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే జడ్‌పి సమావేశం నాటికి జిల్లా పరిషత్‌లోని పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాడిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో మంచినీటి సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. మంచి ▶ 2లో

కుర్లీస్ పాయింట్ వ్యాపారి దారుణహత్య

- చీరాలలో ఘటన ▶ 3లో

విహారంలో విషాదం ఇద్దరు యువకులు మృతి

- వేటపాలెం మండలం రామాపురం వద్ద ఘటన ▶ 3లో

శ్రీ వరహా లక్ష్మీనరసింహస్వామికి పట్టు వస్త్రాలు సమర్పణ




పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి స్వామి

▶ 8లో

ఇంకా తేరుకోని వైసిపి నేతలు

- సొంత జిల్లాలోనే ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి
- హైదరాబాదులోనే మాజీ మంత్రి బాలినేని
- మరో ఇద్దరు మాజీ మంత్రులదీ అదే దారి
- గెలిచిన ఇద్దరూ ఎమ్మెల్యేలే నియోజకవర్గాల్లో..



ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

ఓటమి నుంచి వైసిపి అభ్యర్థులు ఇంకా తేరుకున్నట్లు కనిపించడం లేదు. ఫలితాలు వచ్చి రెండు వారాలు గడుస్తున్నా చాలా మంది ముఖ్యనేతలు జిల్లాలో కనిపించడం లేదు. ఫలితాల రోజునే జిల్లా విడిచి పెట్టిపోయారు. కౌటింగ్ కేంద్రాల నుంచి మధ్యలోనే వెళ్లిపోయిన అభ్యర్థులు అనేక మంది ఇప్పటికీ తిరిగి నియోజక వర్గాలవైపు కన్నెత్తి చూడలేదు. ఎక్కడున్నారో కూడా స్పష్టతలేదు. నియోజక వర్గాల్లో క్యాడర్ కూడా వాళ్లనూ వదిలేశారు. పార్టీ ఓటమికి కారణాలపైనే అంతర్మథనం చెందుతున్నారు. ఇంత దారుణ ఓటమికి కారణాలపైనే అందరూ చర్చల్లో మునిగి తేలుతున్నారు. కోలుకోలేకుండా దెబ్బతిన్నామనే చర్చ పార్టీశ్రేణుల్లో తీవ్రంగా సాగుతోంది. మరోవైపు సోషల్ మీడియాలో ట్రోలింగులూ వైసిపి క్యాడర్‌ను ఇబ్బంది పెడుతున్నాయి. గతంలో చేసిన తప్పిదాల వల్లనే ఇలా జరుగుతుందనుకునేవాళ్లు కొందరుంటే... ఐదేళ్ల తర్వాత మళ్లీ ఇదే తరహాలో ప్రతికారం తీర్చుకుందామని కొందరు అనుకుంటున్నారు. నియోజక వర్గాల్లో వైసిపిలో నిర్వేదం కనిపిస్తోంది. ఓటమి బాధ తట్టుకోలేక సీనియర్ నేతలు ఎవరూ కనిపించడం లేదు. బయటకు రావడంలేదు. గెలిచిన ఇద్దరు ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్‌రెడ్డి అసెంబ్లీకి వెళ్లి ప్రమాణం చేశారు. నియోజకవర్గాల్లో అడపాదడపా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. పార్టీ కార్యకర్తలపై దాడులు జరిగిన వెంటనే వెళ్లి పరామర్శిస్తున్నారు. అధికారిక సమావేశాల్లోనూ పాల్గొంటున్నారు. ఆదివారం నిర్వహించిన జడ్‌పి స్టాండింగ్ కమిటీ సమావేశానికి ఎమ్మెల్యేలు బూచేపల్లి, తాటిపర్తి హాజరయ్యారు. ఇక సీనియర్ నేతలు ఇప్పట్లో వస్తారా? లేదా? అన్నదీ స్పష్టత ▶ 2లో

నాణ్యమైన విద్యుత్తే ధ్యేయం

మంత్రి గొట్టిపాటి రవికుమార్



మంత్రి రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మహిళలు

ప్రజాశక్తి-మేదరమెట్ల

ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే తన ధ్యేయమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. విద్యుత్‌శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గొట్టిపాటి రవికుమార్‌కు మేదరమెట్లలోని ఎస్‌బి కన్వెన్షన్ హాల్‌లో కొరిశపాడు మండల టిడిపి ఆధ్వర్యంలో ఆదివారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి,జనసేన బిజెపి నాయకులు,కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై తమ అభిమాన నేత మంత్రి రవి కుమార్‌కు బొకేలు, శాలువాలు, పూలదండలతో శుభాకాంక్షలు తెలుపుతూ తమ అభిమానాన్ని చాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ మెజార్టీ అందించిన అద్దంకి నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని తెలిపారు. నియోజకవర్గ అభివద్ధి ఏకైక లక్ష్యంగా ముందుకు సాగుతానని తెలిపారు. తనకు విద్యుత్ శాఖమంత్రిగా అవకాశం కల్పించి నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలియ జేశారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. అద్దంకి నియోజకవర్గంలోని రైతులకు సాగు, ప్రజలకు తాగునీటి కోసం ఎత్తిపోతల పథకాలు పూర్తిచేస్తామని తెలిపారు.

జిల్లా అభివృద్ధికి కృషి

(మొదటిపేజీ తరువాయి)

నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాల్సి అవసరం ఉందన్నారు. పెండింగ్ బిల్లులు ఇవ్వటంతో పాటు ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా కొనసాగించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో చేపట్టిన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రూ.27 కోట్ల పనులు రద్దు చేస్తూ తీర్మానం

జిల్లా పరిషత్ ద్వారా మంజూరై నేటికీ ప్రారంభం కాని రూ.27 కోట్ల పనులను రద్దు చేస్తూ స్థాయి సంఘాల సమావేశం తీర్మానం చేసింది. హైస్కూల్ ప్రహరీలు, రహదారులు, కాలువలు వంటి పనులు ఇందులో ఉన్నాయి. ఈ సమావేశంలో జడ్‌పి డిప్యూటీ సిఇఒ హనుమంతరావు, జడ్‌పి వైస్ ఛైర్‌పర్సన్ యన్నాబత్తిన అరుణ, చుండి సుజ్ఞానమ్మ, జడ్‌పిటిసిలు, మూడు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

ఇంకా తేరుకోని వైసిపి నేతలు

(మొదటి పేజీ తరువాయి)

లేదు. ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఫలితాల తర్వాత మళ్లీ జిల్లాకు రాలేదు. ఆయన సొంత జిల్లాలోనే ఉన్నారు. కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు వచ్చాక మాజీ మంత్రి బాలినేని నేరుగా హైదరాబాదు వెళ్లారు. ఆయన ఇప్పటికీ అక్కడే ఉన్నారు. ఒంగోలు నగరపాలక సంస్థ మేయర్, కార్పొరేటర్లు కొందరు వెళ్లి కలిసొచ్చారు. ఒంగోలు వైసిపిలో అయోమయం నెలకొంది. వార్డుల్లో ఉండే పార్టీ కీలక నేతలు మౌనంగా రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఇక సంతనూతలపాడు నుంచి పోటీచేసిన మాజీ మంత్రి మేరుగ నాగార్జున, కొండపి నుంచి పోటీచేసిన మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ఫలితాల తర్వాత నియోజకవర్గాల్లో కనిపించడం లేదు. ఆదిమూలపు సురేష్ ఒకరోజు వచ్చి కొద్దిసేపు కార్యకర్తలో మాట్లాడి వెళ్లిపోయారు. మేరుగ నాగార్జున కూడా ఒక రోజు వచ్చి వెళ్లారు. అంతే..ఇక కనిపించలేదు. ఓటమిపై మండలాల వారీగా పార్టీనేతలను కలిసి మాట్లాడిన పరిస్థితి లేదు. మార్కాపురం నుంచి పోటీచేసిన అన్నా రాంబాబు పట్టణంలోనే ఉంటున్నారు. ఆయనా బయట పర్యటించడం లేదు. గిద్దలూరు నుంచి పోటీ చేసిన నాగార్జున కొంత అందుబాటులో ఉన్నారు. ఆయన చురుగ్గా నియోజకవర్గంలో లేరంటున్నారు. కనిగిరి నుంచి పోటీచేసి ఓడిపోయిన దద్దాల నారాయణకు జడ్‌పిటిసి పదవి ఉన్నందున ఆదివారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశానికి వచ్చారు. వైసిపి అధినేత జగన్ నిర్వహించిన సమావేశానికి బాలినేని తప్ప అందరూ వెళ్లారు. బాపట్ల జిల్లా నుంచీ పోటీ చేసిన వైసిపి అభ్యర్థులు కూడా నియోజకవర్గాల్లో కనిపించడం లేదు. కరణం వెంకటేష్ కాలికి చికిత్స చేయించుకొని హైదరాబాదులో ఉన్నారు. అద్దంకి అభ్యర్థి హనిమిరెడ్డి ఫలితాల తర్వాత నియోజకవర్గానికి దూరంగానే ఉన్నారు. దాదాపుగా అందరూ ఇదే పరిస్థితిలో ఉన్నారు.

అమెరికాలో దుండగుడు కాల్పులు

కర్లపాలెం యువకుడు మృతి

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మరాజు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది అత్యంత పాశవిక చర్య గా పేర్కొన్నారు. గోపి కృష్ణ కుటుంబానికి టిడిపి అండగా ఉంటుంది భరోసా ఇచ్చారు. కల్లు గీత కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ తాత జయ ప్రకాష్ నారాయణ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి

అమెరికా (డల్లాస్)లో యాజలి యువకుడు దారుణ హత్యకు గురైన ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గోపి కృష్ణ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని చంద్రబాబు వెల్లడించారు. గోపికృష్ణ భౌతికాయన్ని త్వరగా స్వస్థలానికి రప్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

26న రాతపరీక్ష

ప్రజాశక్తి-దర్శి: దర్శి అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో 6, 9వ తరగతి చదివే విద్యార్థుల కోసం ఈ నెల 26వ తేదీన రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ మాధవ రావు ఆదివారం తెలిపారు. ఈ నెల 25వ తేదీ లోపు 6,9 తరగతులు చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

ఘనంగా గానాల రామ్మూర్తి వర్ధంతి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

గత 50 ఏళ్ల క్రితమే విశ్వబ్రాహ్మణులకు రాజకీయ ప్రాముఖ్యతను ఇచ్చిన ఘనుడు గానాల రామ్మూర్తి అని విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్తులూరి మల్లికార్జునా చారి అన్నారు. ఆదివారం యర్రగొండపాలెం పట్టణంలోని విశ్వ బ్రాహ్మణ కార్యాలయంలో గానాల రామ్మూర్తి 88వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మద్రాసు, ఆంధ్రా ఉమ్మడి రాష్ట్రాల ఎమ్మెల్సీగా గానాల రామ్మూర్తి చేసిన సేవలను కొనియాడారు. నేటి రాజకీయ పార్టీలు విశ్వబ్రాహ్మణులను విస్మరించడం చాలా బాధకరమన్నారు. గానాల రామ్మూర్తి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం మండల కన్వీనర్ జమ్మోజు వెంకటేశ్వరాచారి, నాయకులు బెజవాడ పెద్ద నాగేశ్వరావు, లింగాల సత్యనారాయణచారి, రంగోజు మల్లికార్జునచారి, జె బసవచారి, గుంటూరు వెంకటాచారి, ముత్తులూరి సత్యనారాయణచారి, నందిగం పాలంకయ్యాచారి, పి రామలింగాచారి, పీర్లపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పొదిలి: విశ్వబ్రాహ్మణ సంఘానికి దివంగత గానాల రామమూర్తి చేసిన సేవలు మరవలేనివని శివాలయం మాజీ ట్రస్టు బోర్డు ఛైర్మన్, పొదిలి విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షులు శామంతపూడి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం పొదిలి విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పండిత రావుసాహెబ్ గానాల రామమూర్తి వర్ధంతి కార్యక్రమం స్థానిక విశ్వబ్రాహ్మణ ఆరామ క్షేత్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రామమూర్తి సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు నూతక్కి నాగేశ్వరరావు, వినుకొండ శ్యామల, మల్లిఖార్జునరావు, చంద్ర, కోటయ్య, సూర్యం, కళ్యాణ్, బాలరంగాచారి, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.



వైపాలెంలో రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

హాకీ పురుషుల జట్టు ఎంపిక

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ప్రకాశం జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా సీనియర్ పురుషుల హాకీ జట్టు ఎంపిక జరిగాయని, ప్రతిభగల క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశామని, ఎంపికైన జట్టు ఈ నెల 27 నుంచి 30 వరకు శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల హాకీ ఛాంపియన్ షిప్‌లో పాల్గొంటుందని కార్యదర్శి ఏ సుందరామిరెడ్డి తెలిపారు. జిల్లా జట్టు ఎంపికను అసోసియేషన్ సభ్యులు పి రవి, వై మాధవరావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ ఆకుల బ్రహ్మయ్య, హాకీ క్లబ్ మైనంపాడు వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ వెంకటేశ్వర్లు, ఆకుల పూర్ణ, ఉమామహేశ్వరరావు, స్వర్ణకుమారి, సీనియర్ హాకీ ప్లేయర్స్ కే వీరాంజనేయులు, పి నవీన్ పాల్గొన్నారని జిల్లా హాకీ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ తిరుమలశెట్టి రవికుమార్ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

కొనకనమిట్ల మండలం నాగంపల్లె గ్రామానికి చెందిన దొడ్డేటిపల్లి రామ్మూర్తి బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతూ హాస్పిటల్‌లో ఉన్నందున ఆర్థిక సాయం కోసం ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘాన్ని కోరడంతో జిల్లా సంఘం ఆధ్వర్యంలో దాతలు ద్వారా సేకరించిన రూ.6,90,666ను ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం చెన్నుపల్లి శ్రీనివాసచారి కార్యాలయంలో రామ్మూర్తి భార్య రాజేశ్వరికి అందజేశారు. సహకరించిన దాతలకు జిల్లా సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు కొనకనమిట్ల సంఘం తరపున యద్దనపూడి వీర బ్రహ్మచారి, సీనియర్ నాయకులు సామంతపూడి నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరి వీరబ్రహ్మచారి, పొన్నపల్లి బ్రహ్మానందం, కుందుర్తి సీతారామాంజనేయులు, గోనుగుంట రజిని, జనార్ధనాచారి, దొడ్డేటిపల్లి రామ్మూర్తి, దొడ్డేటిపల్లి బ్రహ్మయ్య, దొడ్డేటిపల్లి మూర్తి తదితరులు ఉన్నారు.

నరసింహ స్వామి రథోత్సవం

ప్రజాశక్తి-సింగరాయకొండ

సింగరాయకొండ మండలం పాత సింగరాయకొండ గ్రామంలో వరాహ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నరసింహస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ముందుగా శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామిని కొండమీద నుంచి కిందకు తీసుకొచ్చి రథంపై పెట్టి, పాత సింగరాయకొండ గ్రామంలో రథోత్సవంపై నరసింహస్వామిని ఊరేగింపుగా గ్రామాలకు తిప్పారు. ఈ రథోత్సవ కార్యక్రమానికి జనం భారీగా తరలివచ్చారు. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఛైర్మన్ పామర్తి మాధవరావు, ఇఒ పి కృష్ణవేణి, ప్రధాన అర్చకులు ఉదయగిరి లక్ష్మీనరసింహాచార్యులు, బాజీ, ఎంపీపీ యన్నాబత్తిన మురళి, టిడిపి ఒంగోలు పార్లమెంటు లీగల్ సెల్ అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులునాయుడు పాల్గొన్నారు.

వర్షాలకు రూ.6.31 కోట్ల పంట నష్టం

ప్రజాశక్తి-దర్శి

దర్శి వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయం పరిధిలోని ఎనిమిది మండలాలలో రబీ పంటలలో కురిసిన వర్షాలకు 6.31 కోట్ల పంట నష్టం వాటిల్లినట్లు దర్శి ఏడిఏ కె బాలాజీ నాయక్ తెలిపారు. దర్శి ఏడిఏ పరిధిలో 8 మండలాలు ఉండగా అందులో దర్శి, తాళ్లూరు మండలాలలో ఎలాంటి పంట నష్టం వాటిల్లలేదని ఆయన తెలిపారు. మిగతా 6 మండలాలలో కురిచేడులో 94 మంది రైతులకు సంబంధించిన హెక్టార్లలో 16.55 లక్షల నష్టం జరిగినట్లు తెలిపారు.

కొనకనమిట్ల మండలంలో 4,025 రైతులకు సంబంధించి 3832.31 హెక్టార్లలో 3.83 కోట్లు నష్టం వాటినట్లు తెలిపారు. దొనకొండ మండలంలో 314 మంది రైతులకు సంబంధించిన 297.1 హెక్టార్లలోని పంట నష్టం వాటిల్లగా రూ.30లక్షల రూపాయలు నష్టం వాటిని తెలిపారు. పొదిలి మండలంలో 325 మంది రైతులు గాను 151.2 హెక్టార్లలో 18 లక్షల నష్టం వాటికిందన్నారు. ముండ్లమూరు మండలంలో 702 మంది రైతులకు 509.67 హెక్టార్లలో 50.5 లక్షల పంట నష్టం జరిగినట్లు తెలిపారు. మర్రిపూడి మండలంలో 1087 రైతులకు సంబంధించిన 1017.77 హెక్టార్లలోని పంట నష్టం కాగా అందుకు 1.17 కోట్లు నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు. కావున కేంద్రం నుంచి వచ్చిన బృందం పంటల నష్టం అంచనా వేసినట్లు ఆయన తెలిపారు. కావున దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే రైతులకు నష్టపరిహారం వచ్చే అవకాశాలు ఉన్నట్లు వారు తెలిపారు.

విద్యానగర్‌ను అభివృద్ధి చేసుకుందాం

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు మండలంలోనే విద్యానగర్ ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దాలని విద్యానగర్ నూతన అధ్యక్షులు అనగొంది కోటిలింగం అన్నారు. మండలంలోని ఆలకూరపాడు రోడ్డులోని లే అవుట్, అభివృద్ధి కమిటీ సమావేశం వైసిపి మినహా మిగిలిన అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ ప్రాంతానికి విద్యానగర్‌గా నామకరణం చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన వక్తలు నూతన విద్యానగర్‌ను టంగుటూరు మండలంలోనే ఉన్నతంగా అభివృద్ధి చేసుకుందామని అన్నారు. తదుపరి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం

అధ్యక్షులుగా అనగొంది కోటిలింగం, ఉపాధ్యక్షులుగా ఉప్పిరెట్ల మస్తాన్, ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్‌బాబు, అధికార ప్రతినిధులు మోబీనా, ఉప్పిరెట్ల గోపి, కార్య నిర్వాహక కార్యదర్శులుగా చప్పిడి గురవారెడ్డి, షేక్ గుల్జార్, సంయుక్త కార్యదర్శిగా బల్కారి శ్రీనాథ్, కార్యదర్శిగా షేక్ పెద్ద మస్తాన్, కోశాధికారిగా షేక్ కరిముల్లాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



సంతోష్ యాదవ్‌ను సత్కరిస్తున్న బీసీ సమితి నాయకులు

విద్యార్థులు అత్యున్నత శిఖరాలు చేరుకోవాలి

ప్రజాశక్తి-ఒంగోలు

విద్యార్థులు అత్యున్నత శిఖరాలకు చేరుకోవాలని ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన మొట్ట మొదటి మహిళ పద్మశ్రీ సంతోష్ యాదవ్ అన్నారు. జై శ్రీకృష్ణ బీసీ సమితి సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 56 మండలాల్లో 2024 పది పరీక్షల్లో పరీక్షల్లో 500 మార్కులు అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు ఆదివారం అందజేశారు. ఒక్కో మండలం నుంచి ప్రభుత్వ స్కూళ్లలో చదివిన ముగ్గురు విద్యార్థులు, ప్రైవేట్ స్కూళ్లలో చదివిన విద్యార్థు లు ముగ్గురు చొప్పున నగదు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా రూ.3 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.2 వేలు, తృతీయ బహుమతిగా రూ.1,000 చొప్పున అందజేశారు. ద్రావిడ దేశం వి కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించిన పద్మశ్రీ సంతోష్ యాదవ్, విశ్రాంత ఐపిఎస్ ఆఫీసర్ బివి. రమణ కుమార్ చేతుల మీదుగా విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. అనంతరం పద్మశ్రీ సంతోష్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభ పాటవాలతో అత్యున్నత శిఖరాలను అందుకోవడం తోపాటు మన సంస్కృతీ సంప్రదాయాలను కూడా గౌరవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ పెరుగు మురళీకృష్ణ యాదవ్, బివి రమణ కుమార్, మేకల హరికృష్ణ యాదవ్, అడకా స్వాములు, కమిటీ సభ్యుడు డాక్టర్ కాకు శ్రీకాంత్ యాదవ్, ఉపాధ్యాయులు రవికిరణ్ యాదవ్, పిచ్చయ్య యాదవ్, పేగడ శ్రీనివాసకృష్ణ, రంజిత్ కుమార్, గురు ప్రసాద్, బంకా చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతులు అందజేస్తున్న దృశ్యం

విహారంలో విషాదం

- సముద్ర తీరంలో ఇద్దరు యువకులు మృతి
- మరో ఇద్దరిని కాపాడిన తోటి స్నేహితులు
- రామాపురం తీరంలో ఘటన
- మృతదేహాలను పరిశీలించిన ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

ప్రజాశక్తి-చీరాల

ఆదివారం సెలవు దినం కావడంతో సరదాగా సముద్రతీరంలో గడిపేందుకు వచ్చిన ఆ స్నేహితుల్లో విషాదం నెలకొంది. పర్యాటక ప్రాంతం కావడంతో దూర ప్రాంతం నుంచి వచ్చి తీరంలో సరదాగా ఆటలు ఆడుతూ సంతోషంగా ఉన్న ఆ స్నేహితుల సంతోష క్షణాలు ఒక్కసారిగా ఆవిరైపోయాయి. కళ్ల ముందే తమ స్నేహితులు చేజారిపోతుంటే కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోవటంతో వారు అల్లాడిపోయారు. ఇద్దరు స్నేహితులను కోల్పోయారు. ఈ విషాద ఘటన వేటపాలెం మండల రామాపురంలో చోటు చేసుకుంది. తోటి స్నేహితులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళగిరి ప్రాంతానికి చెందిన బంగారు దుకాణంలో పనిచేసే 12 మంది యువకులు ఆదివారం సెలవు కావడంతో తీరంలో సేదతీరేందుకు వేటపాలెం మండలం రామాపురం సముద్రతీరానికి ఆదివారం ఉదయం చేరుకున్నారు. సి బీచ్ రిసార్ట్ సమీపంలో యువకులు అందరూ సముద్ర స్నానాలు చేస్తుండగా ఎగిసిపడుతున్న రాకాసి అలలకు మంగళగిరి ప్రాంతానికి చెందిన వెంకటరత్నం, రఘునాధరావు దంపతులకు కుమారుడు పడవల బాలసాయి(25), అదే ప్రాంతానికి చెందిన సాంబశివరావు కుమారుడు బాలనాగేశ్వరరావు(26) ఇద్దరూ అలల తాకిడికి గురై గల్లంతయ్యారు. అయితే వీరిద్దరినీ తోటి స్నేహితులు గోవర్ధన్, జయంత్ కాపాడే ప్రయత్నం చేస్తున్న క్రమంలో వారు కూడా తీరంలో కొట్టుకుపోయారు. దీంతో అక్కడే మునుగుతున్న తోటి స్నేహితులు స్పందించి చాకచక్యంగా వారిద్దరినీ కాపాడారు. పడవల బాలసాయి, నాగేశ్వరరావు ఇద్దరి మృతదేహాలు కొద్దిసేపటికే ఒడ్డుకు చేరుకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఇదిలా ఉండగా మృతి చెందిన పడవల బాలసాయికి పూజితతో గత రెండు సంవత్సరాల క్రితం వివాహం జరిగిందని, వారికి 3 నెలల పాప ఉందని స్నేహితులు తెలిపారు. దీంతో ఆ కుటుంబాలలో విషాదఛాయలు అలుముకున్నాయి.



పడవల బాలసాయి (ఫైల్), బాల నాగేశ్వరరావు (ఫైల్)



మృతదేహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

తల్లిదండ్రులను పరామర్శించిన ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

రామాపురం ఘటనలో మృతి చెందిన పడవల బాలసాయి బాల నాగేశ్వరరావు మృతదేహాలను ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చీరాల ఏరియా వైద్యశాలకు చేరుకొని పరిశీలించారు. మృతుల తల్లిదండ్రులను పరామర్శించారు. మృతికి గల కారణాలను ఇతర స్నేహితులను అడిగి తెలుసుకున్నారు. రామాపురంలో సంఘటన జరిగిన ప్రాంతాన్ని డిఎస్‌పి బేతపూడి ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. అదేవిధంగా మంగళగిరి ఇన్‌ఛార్జి చల్లపల్లి శ్రీనివాసరావు చీరాల ఏరియా వైద్యశాలకు చేరుకొని మృతదేహాలను పరిశీలించి తల్లిదండ్రులను పరామర్శించారు.

పోలేరమ్మకు మంత్రి స్వామి పూజలు

ప్రజాశక్తి-జరుగుమల్లి



మంత్రి స్వామిని, సత్యను సత్కరిస్తున్న ఆలయ సిబ్బంది

జరుగుమల్లి మండలంలోని కామేపల్లి పోలేరమ్మ వార్షిక తిరుణాళ్ల సందర్భంగా ముగింపు రోజున రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పోలేరమ్మను ఆదివారం దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు పూర్ణ కుంభంతో మేళతాళాలతో స్వాగతం పలికారు. దేవాలయంలో మంత్రి స్వామి, సత్యలకు దేవాలయ ఈఓ, అర్చకులు శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. పోలేరమ్మ దేవాలయ అభివృద్ధి తెలుగు దేశం పార్టీ హయాంలోనే సాధ్యమవుతుందని సత్య తెలిపారు. పోలేరమ్మ తల్లి దేవాలయ అభివృద్ధికి సంపూర్ణంగా సహకరిస్తామని సత్య అన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఛైర్మన్ సూరంపల్లి కొండయ్య, ఈఓ రావెళ్ల శివశంకర్, కామేపల్లి మాజీ సర్పంచి ఏలూరి రాంబాబు, చాగంటి కొండయ్య, దేవాలయ కార్య నిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

దర్శి అభివృద్ధిలో తొలి అడుగు: లక్ష్మి

ప్రజాశక్తి-దర్శి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సారథ్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో దరిశి అభివృద్ధిలో తొలి అడుగుపడడం ఎంతో ఆనందంగా ఉందని తెలుగుదేశం కూటమి నేత డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. దర్శి ప్రజల కలల సాకారంలో భాగంగా పట్టణంలోని డ్రైవింగ్ శిక్షణ మరియు రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు రూ.18.3 కోట్లు కేటాయిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తొలి సంతకం పెట్టడం అభినందనీయమన్నారు. ఇందుకు దర్శి ప్రజల తరపున మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, జిల్లా మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్‌లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మిగిలిన సమస్యలను కూడా మన ప్రభుత్వం ద్వారా పరిష్కరించుకునేందుకు పాటుపడతానని తెలిపారు.

ట్యాంకర్‌తో నీటి సరఫరా

ప్రజాశక్తి-పొదిలి

గత కొద్ది రోజులుగా కుంచేపల్లి గ్రామంలో ప్రజలు పడుతున్న నీటి కష్టాలను తొలగించేందుకు స్థానిక యువకుల ఆధ్వర్యంలో యోగిరెడ్డి యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకర్‌ను టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ ఆదివారం ప్రారంభించారు. నీటి ఎద్దడి నివారణకు ముందుకు వచ్చిన యువతను గ్రామస్తులు అభినందించారు.

రెండు గృహాలలో చోరీ

ప్రజాశక్తి-సింగరాయకొండ

సింగరాయకొండలో తాళాలు వేసిన గృహాలను టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. ఆదివారం గృహ యజమానులు అందుబాటులో లేకపోవడంతో వారు గమనించి చూడగా శింగరాయకొండ బైరాగి మాన్యం కందుకూరు రోడ్డులో రెండు గృహాలలో చోరీలు జరిగాయి. వివరాల్లోకి వెళితే.. బైరాగి మాన్యానికి చెందిన రావూరి గోవిందమ్మ అనే మహిళ వంట చేసుకునేందుకు కందుకూరు ప్రాంతానికి వెళ్లింది. ఆ ఇంటి తలుపులు పగులకొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు బీరువాను సైతం పగలగొట్టి అందులో ఉన్న బట్టలను చెల్లాచెదురు చేశారు. అయితే ఏమేమి చోరీకి గురయ్యాయనేది ఆ ఇంటి యజమాని వచ్చేంతవరకు తెలియని పరిస్థితి. కందుకూరు రోడ్‌లో పురోహితం చేస్తున్న శ్యామ్ అనే వ్యక్తి ఇంట్లో కూడా తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న పదివేల రూపాయల నగదును, బంగారం చైనుతోపాటు మరికొన్ని వస్తువులు తీసుకుపోయినట్లు తెలుస్తోంది. పోలీసులు బ్రహ్మోత్సవాల పనిలో ఉండడంతో ఆ గృహాలను మంగళవారం నాడు పరిశీలించి కేసు నమోదు చేస్తామని చెప్పారని గృహ యజమానులు చెబుతున్నారు. వరుసగా ఒకే ప్రాంతంలో రెండు చోట్ల దొంగతనాలు జరగటంతో ఆ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

బ్రహ్మయ్యకు మాతృ వియోగం

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, పట్టణ ఆర్గనైజింగ్ సెక్రటరీ పొదిలి బ్రహ్మయ్య మాతృమూర్తి పొదిలి బాలమ్మ(80) వయోభారంతో ఆదివారం ఉదయం మృతి చెందారు. టంగుటూరు అరుంధతి నగర్‌కు చెందిన బ్రహ్మయ్య తల్లి మృతి పట్ల పలువురు నాయకులు బాలమ్మకు నివాళులర్పించారు. బ్రహ్మయ్యను పరామర్శించారు.

నేడు టిడిపి 'కురిచేడు' సమావేశం

ప్రజాశక్తి-దర్శి: దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కూటమి నేత డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ కడియాల లలిత్ సాగర్ నాయకత్వంలో సోమవారం ఉదయం 10 గంటలకు కురిచేడు మండల పార్టీ సమీక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు గొట్టిపాటి లక్ష్మి తెలిపారు.

కర్రీస్ పాయింట్ వ్యాపారి హత్య

ప్రజాశక్తి-చీరాల

కర్రీస్ పాయింట్ వ్యాపారిపై అదే ప్రాంతంలోని పండ్ల వ్యాపారి కత్తితో దాడి చేయడంతో వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఆదివారం సంగం థియేటర్ సమీపంలో జరిగింది. మృతుడి తల్లి కే పైడి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. సంగం థియేటర్ సమీపంలో తమ కుమారుడు కంచర్ల సంతోష్(35) కర్రీస్ పాయింట్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఆదివారం ఉదయం తమ కర్రీస్ పాయింట్ ఎదురుగా ఫ్రూట్స్ వ్యాపారం చేసే కె ఉమామహేశ్వరరావు నీళ్లను తమ దుకాణం వైపు వచ్చేలా రోడ్డుపై దొర్లించడంతో ఆ విషయంపై తమ కుమారుడితో ఘర్షణ పడ్డాడు. గొడవ కాస్త సద్దుమణిగిన తర్వాత మరల కొద్దిసేపటికి పండ్ల దుకాణంలో పనిచేసే హరీష్ పేటకు చెందిన జోగి ఏసేపు (చిన్న) తన కుమారుడు సంతోషిని పిలిపించి ఘర్షణ పడి దాడి చేశాడని తెలిపింది. అదే సమయంలో పండ్ల వ్యాపారి ఉమామహేశ్వరరావు ఒక్కసారిగా కత్తితో గుండెలపై దాడి చేశాడని, దీంతో సంతోష్‌కు తీవ్ర గాయాలయ్యాయని అన్నారు. గాయపడిన సంతోషను సంఘటన స్థలానికి పక్కనే ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసేందుకు తీసుకొని వెళుతుండగా ఊపిరి అందడం లేదని అంటున్న సంతోష్ స్టేషన్ గేటు వద్ద చేరుకొనేసరికి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. విషయం గమనించిన పోలీసులు వెంటనే స్పందించి క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆటోలో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. హాస్పటల్లో చికిత్స పొందుతూ తన కుమారుడు మృతి చెందాడని మీడియాకు వివరించారు. సమాచారం అందుకున్న ఒకటో పట్టణ సిఐ శేషగిరిరావు ఏరియా వైద్యశాలకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం సంఘటన స్థలానికి చేరుకొని ఆ ప్రాంతంలో పలువురిని విచారించి జరిగిన ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఏరియా వైద్యశాలకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా వన్ టౌన్ సిఐ శేషగిరిరావుతో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని హత్యకు గల కారణాలను సిఐ అడిగి తెలుసుకున్నారు. ఇది ఇలా ఉండగా మృతుడికి నవ్యతో గత మూడు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న సంతోష్ కత్తిపోటుకు గురవటంతో తమ పరిస్థితి ఏమిటని వృద్ధులయిన తల్లిదండ్రులు, భార్య నవ్య రోదిస్తున్న తీరు చూపరులను కలిచివేసింది.



కంచర్ల సంతోష్ మృతదేహం (ఇన్‌సెట్‌లో) సంతోష్

ఆదర్శప్రాయుడు పూల సుబ్బయ్య

ప్రజాశక్తి-మార్కాపురం

నమ్మిన సిద్ధాంతం కోసం, అట్టడుగు వర్గాల సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టు పార్టీలో తుదిశ్వాస వరకు కొనసాగిన మహోన్నతమైన నేత దివంగత పూల సుబ్బయ్య అని కొనియాడారు. సిపిఐ నేత, మాజీ ఎమ్మెల్యే దివంగత పూల సుబ్బయ్య 37వ వర్ధంతి స్థానిక పూల సుబ్బయ్య శాంతి భవన్‌లో ఆదివారం నిర్వహించారు. సిపిఐ మార్కాపురం నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఈశ్వరయ్య మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం పూల సుబ్బయ్య, గుజ్జుల యలమందారెడ్డి, రావులపల్లి చెంచయ్య తదితరులు ఉద్యమాలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఉద్యమ ఫలితంగానే నేడు ప్రాజెక్టు రూపకల్పన జరిగిందని ఈశ్వరయ్య గుర్తు చేశారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తి చేయాలని అన్నారు. ముందుగా ఆర్టీసీ బస్టాండు సమీపంలోని పూలసుబ్బయ్య, ఆయన సతీమణి తాయమ్మల విగ్రహాలకు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సిపిఐ జిల్లా నాయకులు షేక్ ఖాశిం, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు కె ఎర్రయ్య, సిపిఎం మండల కార్యదర్శి గుమ్మా బాలనాగయ్య, పూలసుబ్బయ్య కుమార్తెలు సుభాషిణి, సునందిని, ఆటో వర్కర్స్ యూనియన్, ఏఐటియుసి అధ్యక్షులు ఏలూరి వెంకటరెడ్డి తదితరులు మాట్లాడారు.



పూల సుబ్బయ్యకు నివాళి అర్పిస్తున్న నాయకులు

యర్రగొండపాలెం:

అమరజీవి పూల సుబ్బయ్య 37వ వర్ధంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కెవి కృష్ణగౌడ్ అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య మాట్లాడారు. సీపీఐ నాయకులు నక్కా తిరుపతయ్య, మొగిలి వెంకటేశ్వర్లు, వై వెంకట శివయ్య, ఆవుల యోగయ్య పాల్గొన్నారు.

దామచర్లను కలిసిన గీత దంపతులు

ప్రజాశక్తి-పొదిలి: నూతనంగా ఎన్నికైన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, టిడిపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ నూకసాని బాలాజీలను పొదిలికి చెందిన ఫుడ్ కమిషన్ మాజీ సభ్యురాలు, పొదిలి మేజర్ పంచాయతీ సర్పంచ్ డాక్టర్ స్వర్ణ గీత, న్యాయవాది వెంకటేశ్వర్లు దంపతులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పూల బొకే అందజేశారు. ఈ కార్యక్రమంలో పొదిలి పట్టణ ముస్లిం మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఖాసీం, పీవీ సురేష్ బాబు, కంచర్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

ట్రాన్స్ జెండర్ మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-మద్దిపాడు

మండల పరిధిలోని వెంకటరాజుపాలెం గ్రామ సమీపంలోని రెనాల్ట్ షోరూం వద్ద గుర్తుతెలియని ట్రాన్స్ జెండర్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఒంగోలు రూరల్ సిఐ టిఎక్స్ అజయ్ కుమార్ మృతదేహాన్ని పరిశీలించారు. మృతి చెందిన హిజ్రా వయసు 35 సంవత్సరాల లోపు ఉంటుందని అన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సిఐ వెంట ఎస్ఐ మహేష్, సిబ్బంది ఉన్నారు.


వైద్యశిబిరానికి హాజరైన జనం

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - చీరాల

వాడరేవు శ్రీశ్రీశ్రీ రామానంద ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆశ్రమ ఆవరణలో ఆదివారం ఉచిత షుగరు వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 984 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. నెలకు సరిపడ మందులు ఉచితంగా అందజేసినట్లు ఆశ్రమ మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. శిబిరానికి హాజరైన వారందరికి అల్పాహారం, తాగునీరు, ఇతర సహాయక ఏర్పాట్లు చేశారు. కేవలం మందులపై ఆధార పడకుండా జీవన విధానం, ఆహారపు అలవాట్లు మార్చు కోవాలని వైద్యులు సూచించారు. మానసిక ఆందోళన తగ్గించుకోవాలని చెప్పారు. జీవన విధానం మార్చుకోవడం ద్వారా షుగరు నియంత్రణలో ఉంచుకోవచ్చని చెప్పారు. క్యాంపులో డాక్టర్ ఎం రాజరాజేశ్వరి, డాక్టర్ కమలా రాజేశ్వరి, డాక్టర్ లలిత్ ప్రకాష్, డాక్టర్ పేట శ్రీకాంత్ వైద్య పరీక్షలు చేశారు. ట్రస్ట్ ఉపాధ్యక్షులు కె కృష్ణారావు, కామేశ్వరరావు, ఎంజి శంకరరావు, బసవరావు, కుమార్, ఎ సురేష్, మిత్ర ల్యాబ్ వలి, దుర్గగుడి శీను, గోపాల్, సాయి ఫణికిషోర్, వాడరేవు స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, చీరాల మహిళా కళాశాల విద్యార్థులు రోగులకు ఆహారం, తాగునీటి వసతులు, సహాయక ఏర్పాట్లు చేశారు.


ఉచిత వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

పంగులూరు : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి 380 మంది హాజరయ్యారు. వీరిలో 220 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు అవసరమని వైద్యులు గుర్తించినట్లు క్యాంప్ ఇంచార్జ్ చిలుకూరు వీరరాఘవయ్య, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కరణం హనుమంతరావు, షేక్ కలీషావలి తెలిపారు. స్థానిక రోటరీ భవనం వద్ద వైద్యశిబిరం నిర్వహించారు. వీరరాఘవయ్య మాట్లాడుతూ గత 16ఏళ్ళుగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనేక మందికి పెదకాకాని శంకర్ కంటి వైద్యశాల సహకారంతో శుక్లాల ఆపరేషన్లు ఉచితంగా చేయించినట్లు తెలిపారు. పంగులూరు క్లబ్‌కు ఉన్నతాధికారులు ఎంతో సహకరిస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలకు క్లబ్ ఉన్నతాధికారులు సహకరించాలని కోరారు. ఆపరేషన్లకు ఎంపికైన వారందరూ సకాలంలో హాజరై ఆపరేషన్లు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ ఇంటూరి ఆంజనేయులు, డాక్టర్ ఎం వెంకటేశ్వర్లు, ఫీల్డ్ వర్కర్ రాంబాబు, రోటరీ సభ్యులు డాక్టర్ బత్తుల వీరనారాయణ, పోలిశెట్టి సీతారామయ్య, పెంట్యాల జగదీశ్వరరావు, వెంకట రామారావు, పోతిని ప్రసాద్, జాగర్లమూడి సుబ్బారావు (జెకెసి), చిలుకూరి వెంకటరమణ పాల్గొన్నారు.

నేడు గుంటుపల్లి సట్టు పోలేరమ్మ తిరునాళ్ల

ప్రజాశక్తి - బల్లికురవ రూరల్

మండలంలోని గుంటుపల్లి గ్రామంలో వేంచేసిన సట్టు పోలేరమ్మ తిరునాళ్లు సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా సట్టు పోలేరమ్మకు పూజలు, అభిషేకాలు జరుగుతాయని తెలిపారు. అనంతరం పదివేల మందికి అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. రాత్రి వేళలో భారీ విద్యుత్ ప్రభలతో సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలతో అంగరంగ వైభవంగా తిరునాళ జరుగుతుందని తెలిపారు.

ప్రవేటీకరణ విధానాలపై ఐక్య పోరాటం



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకుడు వై.సిద్ధయ్య

ప్రజాశక్తి - చీరాల

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి అమలు చేస్తున్న ప్రవేటీకరణ విధానాపై దేశవ్యాప్తంగా ఐక్య పోరాటం చేయడం ద్వారానే ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోగలమని సిపిఎం రాష్ట్ర నాయకులు వై సిద్ధయ్య అన్నారు. సిపిఎం జిల్లా శిక్షణా తరగతుల ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. నయా ఉదార వాద విధానాలను బిజెపి దేశవ్యాప్తంగా అమలు చేస్తుందని అన్నారు. దీని ఫలితంగా ఉపాధి అవకాశాలు దెబ్బతినడమే కాకుండా సామాన్య ప్రజల జీవనం అస్తవ్యస్తం అవుతుందని అన్నారు. ఈ ప్రమాదకర విధానాలను అమలు చేయడం వల్ల వచ్చే ప్రజా వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకు మతపరమైన విద్వేషాలను బిజెపి రెచ్చగొడుతుందని అన్నారు. ఇలాంటి విద్వేషపూరిత విధానాలపై ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, జిల్లా కమిటి సభ్యులు టి కృష్ణమోహన్, సిహెచ్ మణిలాల్, ఎన్ బాబురావు, సిహెచ్ మజుందార్, సిపిఎం నాయకులు పి కొండయ్య, ఎం వసంతరావు పాల్గొన్నారు.


సిపిఎం తరగతులకు హాజరైన కార్యకర్తలు

ఉపాధి కూలీల వేతనాలు ఇవ్వాలి : దడాల

రోజు వేతనం రూ.600 ఇవ్వాలి

ప్రజాశక్తి - చీరాల

ఉపాధి కూలీల వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం స్థానిక బాపనమ్మ కళ్యాణ మండపంలో సంఘం జిల్లా అధ్యక్షులు మోంద్రు ఆంజనేయులు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దడాల సుబ్బారావు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు గత 6వారాల నుండి వేతనాలు రాలేదని అన్నారు. రాష్ట్రంలో చాలా చోట్ల పనులు ఆపారని అన్నారు. పనులు ఆపిన చోట వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగినందున సేద్యంలో వచ్చిన మార్పుల వల్ల వ్యవసాయంలో పనులు తగ్గిపోయాయని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధి కూలీలకు ఏడాదికి 200 రోజులు పనులు కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి గత సవత్సరం కంటే ఈ సవత్సరం బడ్జెట్లో రూ.30వేల కోట్లు కోత విధించిందని ఆరోపించారు. ఉపాధి నుండి కూలీలను దూరం చేసే కుట్రలో భాగమే రెండు పూటలా పని విధానం తెచ్చిందని ఆరోపించారు. ఉపాధి చట్టం ప్రకారం పని చేసిన 2 వారాల్లోపు ఉపాధి వేతనాలు ఇవ్వాలని, కానీ పని చేసి 6 వారాలు గడుస్తున్నా వేతనాలు విడుదల చేయక పోవడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తుందని అన్నారు. బడ్జెట్లో ఉపాధి పథకానికి నిధులు పెంచాలని కోరారు. రోజు కూలీ రూ.600 ఇవ్వాలని అన్నారు. సమావేశం లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్, నాయకులు బి అగస్టీన్, తంగిరాల వెంకటేశ్వర్లు, బొనిగల సుబ్బారావు పాల్గొన్నారు.


సమావేశంలో వ్య.కా.సంఘం అధ్యక్షులు దడాల సుబ్బారావు

మార్టూరు, చిన్నగంజాంలో మార్కెట్ యార్డులు ఏర్పాటు చేయాలి

వ్యవసాయ శాఖ మంత్రికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విజ్ఞప్తి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్ధక శాఖ, డెయిరీ డెవలప్మెంట్, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. విజయవాడలోని మంత్రి స్వగృహం లో కలిసి వివిధ అంశాలపై చర్చించారు. వ్యవసాయ అభివృద్ధికి విశేష కృషి చేయాలని కోరారు. వ్యవసాయ మార్కెట్లను వికేంద్రకరించాలని కోరారు. నియోజకవర్గ కేంద్రంలో ప్రస్తుతం పర్చూరు మార్కెట్ యార్డు ఉందని తెలిపారు. పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతమని, ఆరు మండలాలు సుదూర ప్రాంతంగా విస్తరించి నియోజకవర్గం ఉంటుందని మంత్రి అచ్చన్నాయుడుకు వివరించారు. మార్టూరు, యద్దనపూడి మండలాలకు మార్టూరు మార్కెట్ యార్డు, పర్చూరు, కారంచేడు మండలాలకు పర్చూరు మార్కెట్ యార్డ్, ఇంకొల్లు, చిన్నగంజాం మండలాలకు చిన్నగంజాంలో మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. రైతాంగానికి అండగా నిలవాలని, అన్నదాతల అభ్యున్నతికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్, మాజీ ఎంపీ గల్లా జయదేవ్, టీడీపీ నాయకులు కోడెల శివరాం ఉన్నారు.


మంత్రి అచ్చన్నాయుడును కలిసిన ఏలూరి సాంబశివరావు

మట్టి ఖర్చుల నిమిత్తం గ్రేస్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన జంపని జార్జి అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న గ్రేస్ ఫౌండేషన్ అధినేత క్రైతేపల్లి శాలెం రాజ్ మృతుని కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. నియోజకవర్గంలో ఆపద లో ఉన్న వారికి తమ ఫౌండేషన్ ఆర్థికంగా ఆదుకుంటుందని షాలేంరాజు తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల వారికి చేదోడు వాదోడుగా తమ సంస్థ ఉంటుందని తెలిపారు. తాము అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న ట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్


ఆర్థిక సహాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు


మంత్రి గొట్టిపాటిని కలిసిన గ్రానైట్ అసోసియేషన్ సభ్యులు

గొట్టిపాటి దృష్టికి గ్రానైట్ సమస్యలు

ప్రజాశక్తి - పంగులూరు

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ముప్పవరంలోని తెలుగుదేశం కార్యాలయంలో మార్టూరు గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా గ్రానైట్ పరిశ్రమ ఎదుర్కొం టున్న సమస్యలను మంత్రితో చర్చించారు. గ్రానైట్ సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి గొట్టిపాటి రవికుమార్ గ్రానైట్ అసోసియేషన్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్టూరు గ్రానైట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ఇంటూరి ఆంజనేయులు, అధ్యక్షులు ప్రత్తిపాటి సురేష్, దివ్వె ప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మాజీ జెడ్పిటిసిని పరామర్శిస్తున్న మంత్రి గొట్టిపాటి

సుబ్బారావును పరామర్శించిన మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి - పంగులూరు

మాజీ జెడ్పిటిసి, తెలుగుదేశం సీనియర్ నాయకులు కర్రి వెంకట సుబ్బారావును విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం ఒంగోలులోని సూర్య హాస్పిటల్లో కలిసి పరామర్శించారు. వెంకట సుబ్బారావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సుబ్బారావు అనారోగ్యంతో ఒంగోలు హాస్పిటల్లో చికిత్స పొందుతు న్నారు. విషయం తెలుసుకున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఒంగోలు వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆరోగ్యం మెరుగుపడిందని, మరో రెండు రోజుల్లో డిశ్చార్జ్ అవుతారని వెంకట సుబ్బారావు తెలిపారు. మంత్రి వెంట తెలుగుదేశం నాయకులు గరిమిడి జగన్మోహనరావు, మాజీ సర్పంచ్ ఉన్నం రవి, డైరీ మాజీ చైర్మన్ బాలిన రామసుబ్బారావు, టిడిపి అధికార ప్రతినిధి గుర్రం రాజశేఖర్, నాయకులు గొట్టిపాటి ఖాజా స్వామి, మురకొండ సుబ్బారావు ఉన్నారు.


డంపింగ్ యార్డ్ పరిశీలిస్తున్న సత్తిబాబు

పొగను తక్షణమే అదుపు చేయాలి

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - బాపట్ల

డంపింగ్ యార్డులో చెత్త తగలబడుతూ దట్టమైన పొగ వ్యాపించడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై మున్సిపల్ ప్రత్యేక అధికారి, డిఆర్‌ఓ సత్తిబాబు స్పందిం చారు. దట్టమైన పొగలతో పట్టణ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న డంపింగ్ యార్డును మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. 10 రోజులకుపైగా డంపింగ్ యార్డులో చెత్త తగలబడుతుంటే ఎందుకు అదుపు చేయ లేకపోయారని ప్రశ్నించారు. పొగతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోందని అన్నారు. ఇప్పటికీ అధికారులు స్పందన లేకపోవడం ఏమిటన్నారు. పొగ సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ఆయన తోపాటు కమిషనర్ శ్రీకాంత్, శానిటరీ ఇన్స్పెక్టర్ నజీర్, పర్యావరణ ఇంజనీరు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఆర్‌టిసి బస్టాండు

భయాందోళనలో ప్రయాణికులు ● కొత్త భవనం నిర్మించాలని విన్నపాలు

ప్రజాశక్తి-మార్కాపురం

మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన మార్కాపురం పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండు ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. పైకప్పు స్లాబు పెచ్చులూడి పడుతోంది. ప్రయాణికులు బస్టాండులోకి వెళ్లాలంటే భయపడుతున్నారు. మార్కాపురం రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉంది. త్వరలో జిల్లా అవుతుందనే ప్రచారమూ ఉంది. నానాటికీ విస్తరిస్తున్న మార్కాపురం పట్టణంలో సుమారు లక్ష జనాభా నివశిస్తోంది. డివిజన్‌తో పాటు పొరుగు ప్రాంతాల నుంచి వేలాదిగా నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వీరంతా మార్కాపురం ఆర్‌టిసి బస్టాండు కేంద్రంగా ప్రయాణిస్తుంటారు.


మార్కాపురం ఆర్‌టిసి బస్టాండు


దెబ్బతిన్న పైకప్పు


స్లాబు ఊడిపడటంతో దెబ్బతిన్న ఫ్యాను

మార్కాపురం పట్టణంలో ఆర్‌టిసి డిపో కూడా ఉంది. ఈ డిపో నుంచి నిత్యం 90 బస్సు సర్వీసులు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయి. ప్రయాణికుల అవసరాల దృష్ట్యా మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో ఆర్అండ్‌బి కార్యాలయం సమీపంలో ఎపిఎస్‌ఆర్‌టిసి బస్టాండును ప్రభుత్వం మంజూరు చేసింది. 1991 ఆగస్టు 30వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి మార్కాపురంలో ఆర్‌టిసి బస్టాండు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తి చేసిన తరువాత 1993 నవంబర్ 17వ తేదీన అప్పటి రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రిగా ఉన్న ఎంవి మైసూరారెడ్డి ప్రారంభించారు. బస్టాండు మంజూరుకు అప్పట్లో స్థానిక ఎమ్మెల్యేగా ఉన్న కెపి కొండారెడ్డి కృషి చేశారు.

మార్కాపురంలో ఆర్‌టిసి బస్టాండు నిర్మాణం పూర్తి చేసుకుని మూడు దశాబ్దాలు దాటింది. ప్రస్తుతం పూర్తి స్థాయిలో దెబ్బతింది. పై భాగాన ఉన్న స్లాబు పెచ్చులూడి పడుతోంది. పలుమార్లు తాత్కాలిక మరమ్మతులు చేసినా నిలబడటం లేదు. పై కప్పు దెబ్బతిని పెచ్చులూడి పడుతోంది. స్లాబులో, బీముల్లోని ఇనుప చువ్వలు సైతం బయటపడ్డాయి. స్లాబు లోపల వేసిన ఇనుము కూడా తుప్పుపట్టింది. మొత్తానికి బస్టాండు అంతా దెబ్బతింది. శ్లాబు పెచ్చులూడుతున్న కారణంగా ఫ్యాన్ రెక్కలు వంగిపోతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఆర్‌టిసి బస్టాండులో ఇలాంటి ప్రమాదకర పరిస్థితి నెలకొనడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని భయంతో వణుకుతున్నారు. చిన్నారులకు చిన్న ప్రమాదమే జరిగినా తట్టుకోలేరు. ఆర్‌టిసి అధికారులు తక్షణమే స్పందించాలని, బస్టాండుకు కొత్త భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

240 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి డాన్ టు డస్క్ కార్యక్రమంలో భాగంగా సంతనూతలపాడు వాసవి మరియు మహిళా క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సంతనూతలపాడులో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఒంగోలు ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ వారి ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో మొత్తం 240 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి వారికి 70 వేల రూపాయల విలువ చేసే మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని అంతర్జాతీయ వాసవి క్లబ్ ఉపాధ్యక్షులు డి పాండురంగయ్య ప్రారంభించారు. వైద్య శిబిరంలో ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డైరెక్టర్లు డాక్టర్ చవల ప్రకాష్, డాక్టర్ కే అనిల్ కుమార్, డాక్టర్ ఉమాపతి చౌదరి, డాక్టర్ ఏ శ్రీనివాసరావు, వైద్యులు జి శ్రీనివాసులు, పోకూరి శ్రీనివాసులు, కే రామసుబ్బారెడ్డి, కే జ్యోత్న్న వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాస్ హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ ఎంకె బాషా, వాసవి క్లబ్ జిల్లా ప్రతినిధులు వివిఎన్ ప్రసాద రావు, జివిఎల్ ప్రసాదరావు, వాసవి క్లబ్ అధ్యక్షులు వి వెంకట శేషారావు, కార్యదర్శి చల్లువాది రాము కోశాధికారి పి సుధాకర్, గౌరవాధ్యక్షులు పి వెంకటేశ్వర్లు, మహిళా క్లబ్ అధ్యక్షురాలు చలువాది చంద్రావతి, కార్యదర్శి ఎస్ జయశ్రీ, కోశాధికారి జి శ్రీలక్ష్మి, గౌరవాధ్యక్షురాలు జి పద్మజ, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జి శరత్‌బాబు, వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సిహెచ్ వెంకటస్వామి, టీ రంగస్వామి, ఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లకు సత్కారం

వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డాన్ టు డస్క్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎస్ఐ ఎం దేవకుమార్, హెడ్ కానిస్టేబుల్ ఎం శ్రీనులను వాసవీ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు.

వాసవి సేవా కార్యక్రమాలు

వాసవి క్లబ్ డాన్ టు డస్క్ కార్యక్రమంలో భాగంగా వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఒంగోలు మనోవికాస కేంద్రానికి బియ్యం పంపిణీ చేశారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయానికి 50 కుర్చీలను బహూకరించారు. గ్రామంలో వివిధ ప్రాంతాల్లో 6 సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు.


ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

ప్రజాశక్తి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-పామూరు

ప్రజాశక్తి ముద్రించిన కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి విజయోత్సవ ప్రత్యేక సంచికను ఆదివారం ఒంగోలులోని మద్దిశెట్టి శ్రీధర్ నివాసంలో ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దర్శి మాజీ శాసనసభ్యులు మద్దిశెట్టి వేణుగోపాల్ తమ్ముళ్లు మద్దిశెట్టి రవికుమార్, మద్దిశెట్టి శ్రీధర్, పారిశ్రామికవేత్త యారవ శ్రీనివాసులు, ప్రజాశక్తి జిల్లా ఇన్‌ఛార్జి ఎస్‌వి బ్రహ్మం, కనిగిరి ఇన్‌ఛార్జి కొండలరావు, పామూరు ప్రజాశక్తి రిపోర్టర్ బి నాగేశ్వరావు, టిడిపి నాయకులు బైరెడ్డి జయరాంరెడ్డి, తుమ్మ ఆంజనేయులు, మాధవరావు, హనుమంతునిపాడు రిపోర్టర్ కటికల ఆగస్టీన్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముప్వా రంగ సాయి యాదవ్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

తాగునీటిపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పెద్దదోర్నాల ఎంపిపి గుమ్మా పద్మజ యల్లేష్ తెలిపారు. ఆదివారం పెద్దదోర్నాలలోని విద్యా వనరుల కేంద్రంలో ఆమె అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆ సందర్భంగా గుమ్మా పద్మజ యల్లేష్ మాట్లాడుతూ పెద్దదోర్నాల పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. వర్షాకాలం వచ్చినందు వల్ల బోర్లలో నీటి మట్టం పెరిగే అవకాశం ఉందని అన్నారు. వినియోగంలో ఉన్న డీప్‌బోర్లు, చేతి పంపులకు మరమ్మతులు చేయించాలన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో ఉండి ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. అవసరమైన చోట వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో నాసర్‌రెడ్డి, ఎంఈవో మస్తాన్ నాయక్, జడ్పిటిసి లతాబాయి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దర్శనం నాగయ్య, పరుచూరి సురేఖ, పెద్దదోర్నాల సర్పంచ్ చిత్తూరి హారికతో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న అబ్దుల్ గఫూర్

పారిశుధ్యంపై అలసత్వం తగదు

- మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

ప్రజాశక్తి-కనిగిరి

పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే సహించేది లేదని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని 14వ లాడే సాహెబ్ బజారులో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ పర్యటించి అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ప్రజలు డ్రైనేజీ కాలువలు, పారిశుధ్యం సమస్య ఉందని చైర్మన్ దృష్టికి తేగా ఆయన వెంటనే శానిటరీ సెక్రటరీ, మున్సిపల్ కార్మికులను పిలిపించి అపరిశుభ్రంగా ప్రాంతాన్ని శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ ప్రాంతంలో మురుగునీరు, సైడ్ కాలువల్లో ఉన్న పూడికను తీసి శుభ్రపర్చాలని కోరారు. చైర్మన్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది పవన్‌కుమార్, ఆ ప్రాంత ప్రజలు ఉన్నారు.


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ ఫిరోజ్ ఫాతిమా

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-పుల్లలచెరువు

రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పుల్లలచెరువు ఎస్ఐ ఎండి ఫిరోజ్ ఫాతిమా ఆధ్వర్యంలో ఆదివారం పుల్లలచెరువు పరిసరాల్లో వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పకుండా పెట్టుకోవాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. పరిమితికి మించి వేగంగా ప్రయాణించరాదన్నారు. త్రిబుల్ రైడ్ చేయరాదని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకు పంపిస్తామన్నారు. సరైన పత్రాలు లేని వాహనాలను గుర్తించి అపరాధ రుసుం విధించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


సీనియర్ జర్నలిస్టు శ్రీనివాసరావును సన్మానిస్తున్న వాసవి మరియు మహిళా క్లబ్ ప్రతినిధులు

సీనియర్ జర్నలిస్ట్ శ్రీనివాసరావుకు సత్కారం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

గత 30 సంవత్సరాలుగా పత్రికా రంగంలో విశిష్ట సేవలందించిన సీనియర్ జర్నలిస్ట్ శిఖాకొల్లి శ్రీనివాసరావును స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం వాసవి మరియు మహిళా క్లబ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ జిల్లా ప్రతినిధులు వివిఎన్ ప్రసాదరావు, జివిఎల్ ప్రసాదరావు, వాసవీ క్లబ్ అధ్యక్షులు వివి శేషారావు, కార్యదర్శి చలువాది రాము, కోశాధికారి పామిడి సుధాకర్, గౌరవాధ్యక్షులు పి వెంకటేశ్వర్లు, మహిళా క్లబ్ అధ్యక్షులు సిహెచ్ చంద్రావతి, కార్యదర్శి ఎస్ జయశ్రీ, కోశాధికారి జి శ్రీలక్ష్మి, గౌరవాధ్యక్షులు జి పద్మజ, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జీ శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

హోం మంత్రి వంగలపూడి అనితకు ఘన స్వాగతం

ప్రజాశక్తి -మార్టూరు రూరల్

రాష్ట్రంలో ప్రజలందరూ మెచ్చేలా పాలన సాగుతుందని, ప్రజా సంక్షేమం, అభివృద్ధికి తొలి ప్రాధాన్యత ఇస్తామని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఇసుక దర్శిలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయానికి ఆమె ఆదివారం వచ్చారు. ఆమెకు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, ఏలూరి అభిమానులు ఘన స్వాగతం పలికారు. తెలుగు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశంపై రాష్ట్ర ప్రజలు చూపిన అభిమానం మరువలేనిదని అన్నారు. ప్రజా తీర్పు చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. ఎన్నికల్లో తెలుగుదేశంపై నమ్మకంతో ప్రజలు ఆదరించారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై నమ్మకంతో 164 సీట్లతో కూటమిని గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నూరు శాతం నిలబెట్టుకుంటామని అన్నారు. అమరావతి రాజధాని, పోలవరం నిర్మాణంపై దృష్టి పెట్టి అతిత్వరలో పూర్తి చేస్తామని అన్నారు. వైసిపి హయాంలో రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి దిగజారిందని ఆరోపించారు. తమ హయాంలో శాంతి భద్రతలను పూర్తిగా పరిరక్షిస్తామని అన్నారు. మహిళల రక్షణకు టిడిపి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. చీరాల మండలం ఈపురుపాలెంలో యువతిపై అత్యాచారం, హత్య కేసులో గంటల వ్యవధిలో స్పందించడం, నిందితులను అరెస్ట్ చేసి చరిత్ర సృష్టించామని అన్నారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హ్యాట్రిక్ విజయం సాధించారని అన్నారు. బాపట్ల జిల్లా అధ్యక్షునిగా విశేష కృషి చేసి జిల్లాలోని అన్ని స్థానాల్లో టిడిపి ఘన విజయానికి తోడ్పడ్డారని అభినందించారు. టిడిపి ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఏలూరికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. మహిళలతో కొద్దిసేపు మాట్లాడి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. మహిళల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. వివిధ కేసులను ఆమె దృష్టికి నేతలు తీసుకెళ్లారు. విద్యార్థులపై అక్రమ కేసులు బనాయించారని, కులం పేరుతో దూషించినట్లు కొన్ని కేసులు బలవంతంగా పెట్టించారని ఆమెకు స్థానిక నాయకులు వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి అనిత సమగ్ర విచారణ జరిపి విద్యార్థులపై అక్రమ కేసులు బనాయించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. న్యాయబద్ధంగా సమగ్ర విచారణ జరిపి కేసులను త్వరితగతిన ఛేదించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పోలీస్ శాఖపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని నిలబెట్టాలని, పోలీస్ శాఖలో సమస్యలనూ పరిష్కరిస్తామని అన్నారు.


మంత్రి అనితకు స్వాగతం పలుకుతున్న డిఎస్‌పి మురళీకృష్ణ


మాట్లాడుతున్న పఠాన్ రాజేష్

స్పందనకు వందనం

ప్రజాశక్తి - బాపట్ల

చీరాల మండలం ఈపురుపాలెంలో సుచరిత అనే యువతిపై రాక్షసక్రీడకు పాల్పడి హతమార్చిన మానవ మృగాలను 48 గంటలు గడవక మదే అరెస్టు చేసి కటకటాల వెనక్కి పంపడం పోలీస్ వ్యవస్థకే గొప్ప గర్వకారణమని, ప్రభుత్వ స్పందనకు అబ్దుల్ కలాం ఫౌండేషన్ చైర్మన్ పఠాన్ రాజేష్ వందనం ప్రకటించారు. అబ్దుల్ కలాం విగ్రహం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతిపై అత్యాచారం, హత్య బాధాకరమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణ స్పందనతో హెూమ్ మంత్రి వంగలపూడి అనిత వచ్చి యువతి కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం తరుపున కుటుంబ సభ్యులకు అన్నివిధాలుగా అండగా ఉంటామని బరోసా ఇవ్వడమే కాకుండా బాధ్యత కుటుంబానికి రూ.10లక్షల ఆర్థిక సహాయం అందజేయడం అభినందించ దగిన విషయమని పేర్కొన్నారు. సమావేశంలో అబ్దుల్ కలాం ఫౌండేషన్ సభ్యులు మొహిద్దీన్, షేక్ సిరాజ్, రెహమాన్, నాయబ్ రసూల్, పీరా సాహెబ్ పాల్గొన్నారు.

నీట్ పరీక్షల బాధితులు తరలి రావాలి

ప్రజాశక్తి - బాపట్ల

దేశవ్యాప్తంగా జరిగిన నీట్ పరీక్షల అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు నీట్ పరీక్షలు రాసిన విద్యార్థులు, తల్లి, దండ్రులు తరలిరావాలని ఇండియా కూటమి ప్రతినిధి మేధా శ్రీనివాసరావు కోరారు. విలేకర్లతో ఆదివారం మాట్లాడారు. దేశ చరిత్రలో ఒకే పరీక్షా కేంద్రంలో తొలిసారిగా 67 మంది విద్యార్థులకు 720/720 మార్కులకు నూటికి నూరు శాతం సాధించడం అంతుచిక్కని రహస్యంగా ఉందన్నారు. ఆలస్యం కారణంతో 1563 మందికి గ్రేస్ మార్కులు ఇవ్వడం, ఆ గ్రేస్ మార్కులు రద్దుచేసి తిరిగి పరీక్ష పెట్టాల్సిందిగా సుప్రీంకోర్టు ఆదేశించిందని అన్నారు. 24లక్షల మంది పరీక్ష రాసిన విద్యార్థులు, తల్లి, దండ్రుల మనోభావాలు దెబ్బ తీసే విధంగా నీట్ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. అవక తవకలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ అంశంపై కలెక్టరుకు వినతి పత్రం అందజేసేందుకు నీట్ పరీక్ష బాధితులు హాజరు కావాలని కోరారు.


రామోజీరావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

ఆధ్యాత్మిక గ్రంథాలతో ప్రశాంతత

ప్రజాశక్తి - అద్దంకి

సాహితీ మిత్ర మండలి ఆధ్వర్యంలో పట్టణంలోని మారంవారి సేవాసదనంలో ఆత్మీయ పురస్కార సభ ఆదివారం నిర్వహించారు. సభకు లక్కరాజు చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. తొలుత ఈనాడు అధినేత రామోజీ రావుకు నివాళి అర్పించారు. ఈసందర్భంగా పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి మాట్లాడారు. ఆధ్యాత్మిక గ్రంథాలు మనసుకు ప్రశాంతత చేకూరిస్తాయని అన్నారు. శతావధాని నారాయణం బాల సుబ్రహ్మణ్యం, డివిఎం సత్యనారాయణ, లక్కరాజు శ్రీనివాసరావు, పోలూరి శివరామ ప్రసాదరావు, చప్పిడి వీరయ్య, చుండూరి మురళీ సుధాకరరావు, వామరాజు వేంకటేశ్వరరావు, ఒరుగంటి శ్రీనివాసరావు, కోలలపూడి శ్రీనివాసరావు, కూరపాటి రామకోటేశ్వరరావు పట్టువస్త్రాలు, సన్మాన పత్రం అందజేసి ఆత్మీయంగా సత్కరించారు. గాడేపల్లి దివాకర దత్తు, డాక్టర్ యు దేవపాలన, హనుమంతరావు, నాగేశ్వరరావు, ధేనువకొండ సుబ్బారావు, అంగలకుర్తి ప్రసాదు పాల్గొన్నారు.

వ్యాపారులకు విజిలెన్స్ అధికారుల వేధింపులు

- ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల అనధికారిక దాడులు
- లక్షలు ఇవ్వాలంటూ బెదిరింపులు
- హడలెత్తిపోయిన వ్యాపారులు

ప్రజాశక్తి - అద్దంకి

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పేరుతో కొందరు అధికారులు పట్టణంలో అనధికారిక దాడులు చేశారు. అధికారుల తనిఖీల సమాచారంతో పట్టణంలో వ్యాపార సంస్థల నిర్వాహకులు హడలెత్తి పోయారు. గుంటూరు నుండి ఎన్ఫోర్స్మెంట్ డిపార్ట్మెంట్ అధికారులు పట్టణంలో శనివారం దుకాణాలను తనిఖీ చేశారు. వీరికి పట్టణంలో ఏ దుకాణం ఎవరనే సమాచారం తెలియకపోవడంతో ఉద్యోగ విరమణకు దగ్గరల్లో ఉన్న చీరాల జిఎస్‌టి కార్యాలయానికి చెందిన ఓ వ్యక్తి గుంటూరు నుండి వచ్చిన వాళ్లకు సహకరిస్తూ దుకాణ దారులపై బెదిరింపులకు పాల్పడ్డట్లు పట్టణంలో చర్చ జరిగింది. జిఎస్‌టి పేరుతో అనధికారికంగా లక్షల్లో వసూళ్లు చేసినట్లు ప్రచారం జరిగింది. చీరాల జిఎస్‌టి కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి దుకాణ దారులను భయభ్రాంతులకు గురి చేసినట్లు వ్యాపారులు చెప్పుకుంటున్నారు. గుంటూరు నుండి విజిలెన్స్ అధికారులు వచ్చారు. వాళ్లతో ఏదో ఒకటి మాట్లాడుకుని వివాదం లేకుండా చేసుకోండంటూ సున్నితంగా సమాచారం చెప్పినట్లుగా వ్యాపారుల వద్ద నటించి దుకాణ దారుల నుండి పెద్ద మొత్తంలో వసూళ్లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా ఏదైనా ఫిర్యాదు ఉంటే దుకాణ దారులను నోటీసులు ఇచ్చి తనిఖీలు చేస్తుంటారు. కానీ ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. మెయిల్ చేశామని చెబుతూ బెదిరింపులకు పాల్పడ్డారంటూ వ్యాపార సంస్థల యజమానులు వాపోతున్నారు. ప్రభుత్వం మారినప్పటికీ అధికారులు మాత్రం గత ప్రభుత్వంలో నెలవారీ అనధికారిక వసూళ్లు చేసినట్లే చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. గుంటూరు నుండి విజిలెన్స్ అధికారులే నిజంగా తనిఖీలకు వస్తే చీరాల జిఎస్‌టి కార్యాలయ అటెండర్‌కు అద్దంకిలో ఏమి పని అంటూ వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. అద్దంకి ప్రాంత వ్యాపారులు అందరూ చీరాల కార్యాలయం కేంద్రంగానే జిఎస్‌టి లావాదేవీలు చేస్తుంటారు. ఆ విధంగా అద్దంకి ప్రాంతంలో వ్యాపార సంస్థల వివరాలు తెలిసిన చీరాల జిఎస్‌టి కార్యాలయ అటెండర్‌గా పనిచేస్తున్న వ్యక్తే పట్టణంలోని వ్యాపార సంస్థల నుండి అనధికార వసూళ్లకు కేంద్రబింధువని వ్యాపార సంస్థల ప్రతినిధులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని అనధికారిక దాడులు నివారించి వ్యాపార సంస్థలను కాపాడాలని కోరుతున్నారు.

నిలకడగా శనగల ధర

ప్రజాశక్తి - ఇంకొల్లు

గత నెల రోజులుగా శనగల ధర నిలకడగా ఉంది. ప్రస్తుతం ఎర్ర శనగలు క్వింటా రూ.6800 కాగ్ 2రకం తెల్లశనగల ధర క్వింటా రూ.8300 నుంచి రూ.8400 వ్యాపారం జరుగుతుంది. ఈ ఏడాది నూర్పిల్లు ప్రారంభం నుంచి ఎర్ర శెనగల ధర క్వింటాలు రూ.5800 పలికినప్పటికీ క్రమంగా తగ్గుతూ వాటి ధర నూర్పిళ్ళు పూర్తయ్యేసరికి రూ.5400లకు చేరింది. అయితే మరల మే నెల ప్రారంభం నుండి జూన్ నెల ఆరంభం వరకు క్రమంగా 2రోజులకు రూ.100చొప్పున పెరుగుతూ ఒకానొక సమయంలో క్వింటా రూ.7వేలు ధర పలికింది. రూ.7వేల ధర ఒక్కరోజు మాత్రమే ఉన్నట్లు వ్యాపార వర్గాలు తెలిపాయి. మళ్లీ వాటి ధర క్రమంగా తగ్గుతూ ప్రస్తుతం క్వింటా రూ. 6700 నుంచి రూ.6800 పలుకుతుంది. గత నెల రోజుల నుంచి దాదాపు నిలకడగా ఇదే ధరపై వ్యాపారం జరుగుతుంది. అయితే ధరలు మొదట్లో కన్నా ఇప్పటికి పెరిగినప్పటికీ వ్యాపారం మందకొడిగా సాగుతుంది. రైతులు ఇంకా ఎర్ర శనగల ధర రాబోయే రోజుల్లో పెరగబోతున్నదన్న ఆశతో ఉన్నారు. నిల్వచేసి ఇప్పటికి అమ్మటానికి ఇష్టపడటం లేదు. ఎర్ర శనగల ధర భవిష్యత్తులో పెరుగుతుందన్న ఆశ వ్యాపారుల్లోనూ ఉంది.

నిలకడగా తెల్ల శనగల ధర

కాగ్ 2 వంటి ప్రత్యేక రకాలైన తెల్ల శనగల ధర గత రెండు నెలల నుంచి నిలకడగానే ఉంది. గత ఏడాది ప్రారంభంలో రూ.8వేలు పలికిన ధర విత్తనాలు ఎదబెట్టే సమయానికి రూ.11వేల నుంచి రూ.13వేలు అమ్మింది. అయితే ఈ ఏడాది రబీ శనగల నూర్పుడి ప్రారంభం నుంచి క్రమంగా ధర తగ్గుతూ మే నెల వచ్చేసరికి రూ.8500 పలికింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు తెల్లశనగల ధర రూ.8300 మించి అమ్మటం లేదు. గత ఏడాది విత్తన దశలో తెల్ల సెనగల ధర ఆశాజంగా ఉండటంతో రైతులు ఎక్కువగా తెల్లశనగ సాగు చేపట్టారు. అయినప్పటికీ ఒక మోస్తరుగా దిగుబడులు వచ్చాయి. సాగు ఎక్కువగా చేపట్టటంతో వాటిని నిల్వలు ఎక్కువగానే కోల్డ్ స్టోరేజీల్లో ఉన్నాయి. 10శాతం మంది మాత్రమే ఇప్పటికీ తెల్లశనగలు రూ.8500 నుంచి రూ.8300కు అమ్మకం సాగించగా 90శాతం మంది రైతులు ధర తక్కువగా ఉండటంతో నిల్వ చేశారు.


శనగల్లో వ్యర్ధాలు వేరు చేస్తున్న మహిళలు

ఎర్ర శెనగలకు గిరాకీ ఆశ

గత ఏడాది రబీలో ఎర్ర శనగల సాగు విస్తీర్ణం తక్కువగా ఉంది. దానికి తోడు పంట దిగుబడి కూడా ఎర్రచెనగ భారీగా తగ్గింది. ఎర్రశనగ నిల్వలు కోల్డ్ స్టోరేజీల్లో తక్కువగానే ఉన్నాయి. వివిధ రాష్ట్రాల్లో కూడా ఎర్రశనగ సాగు గత ఏడాది తక్కువగా చేపట్టడంతో పాటు దిగుబడులు తగ్గాయన్న సమాచారం వ్యాపారులు చెబుతున్నారు. భవిష్యత్తులో ఎర్ర శనగల ధరకు గిరాకీ రానునదని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మళ్ళీ ఏడాది విత్తనాలు ఎదపెట్టబోయే సమయానికి భారీగా పెరుగుతున్న ఆలోచనతో పైతాంగం వ్యాపారులు ఉన్నారు. కనీసం రూ.9వేల వరకు చేరే అవకాశం ఉందన్న ఆశతో ఉన్నారు.

ఐదేళ్లుగా ప్రజల అవస్థలు

అధ్వానంగా రావికంపాడు, తెనాలి రహదారి

ప్రజాశక్తి - వేమూరు


వేమూరు నియోజకవర్గ కొల్లూరు మండలం రావికంపాడు గ్రామ రహదారి గతైదేళ్లుగా అధ్వాన్న స్థితికి చేరి ప్రజల రవాణాకు ఆటంకంగా మారింది. భట్టిప్రోలు నుండి తెనాలికి గతంలో ఈ రహదారిపై నిత్యం ఆర్టీసీ బస్సులు ప్రయాణించేవి. పెనుమర్రు అబ్బన గూడవల్లి తాడిగిరిపాడు రావికంపాడు మీదుగా క్రాప అడ్డరోడ్డు మీదుగా ఈ బస్సు తెనాలికి ప్రయాణిస్తూ ఉండేది. పేనుమర్రు అడ్డ రోడ్డు నుండి క్రాప్ అడ్డ రోడ్డు వరకు ఈ రహదారి పూర్తిగా దెబ్బతిని పెద్ద పెద్ద గుంటలు ఏర్పడి రాకపోకలకు అంతరాయంగా మారటమే కాక బస్సుల్లో ప్రయాణించడానికి కూడా ప్రయాణికులు భయపడాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. వైసిపి ప్రభుత్వ పాలనలో రహదారులపై దృష్టి సారించకపోవడంతో అప్పటికే నిర్మించి ఉన్న రహదారులు క్రమక్రమంగా వాహనాల రాకపోకలకు దెబ్బతిని చివరకు ప్రయాణానికి కూడా పనికి రాని విధంగా మారాయని ఆ ప్రాంతవాసులు ఆరోపిస్తున్నారు. భట్టిప్రోలు నుండి తెనాలి వెళ్లేందుకు ఉన్న ప్రధాన మార్గాల్లో ఇది రెండవది. ఈ మార్గంలో సుమారు నాలుగు గ్రామాల ప్రజల రవాణాకు ఆర్టీసీ బస్సులు ఉపయోగపడుతూ ఉంటాయి. రహదారులు దెబ్బతిన డంతో కనీసం ఆటోలు కూడా నడిచే పరిస్థితి లేకపోవడంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు తెనాలి భట్టిప్రోలు వంటి ప్రాంతాలకు వెళ్లడానికి నానా అవస్థలు పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారులు అధ్వానంగా మారడంతో ఆర్టీసీ బస్సులు కూడా తగ్గిపోయాయని దీని కారణంగా మరింత ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని తక్షణమే నూతన ప్రభుత్వ పాలనలోనైనా ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులు దృష్టి చారించి అధ్వాన్నంగా మారిన రావికంపాడు రహదారిని అభివృద్ధి పరిచి ప్రజల ఇక్కట్లను తొలగించాలని కోరుచున్నారు.


అధ్వానంగా ఉన్న రావికంపాడు, తెనాలి రహదారి

ప్రజలకు మినరల్ వాటరే దిక్కు..

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల కేంద్రం భట్టిప్రోలు మేజర్ పంచాయతీలో ప్రజలకు పూర్తిస్థాయిలో సరైన త్రాగునీరు సరఫరా కాక మినరల్ వాటర్ కే పరిమితం అయ్యారు. ఈ గ్రామంలో 6 ట్యాంకులు ద్వారా ప్రజలకు త్రాగునీటి వసితిని కల్పించేందుకు ఏర్పాటు చేశారు. ఈ ట్యాంకుల ద్వారా విడుదలయ్యే త్రాగునీరు పైపులైల నిర్మాణం సక్రమంగా లేకపోవడంతో మురుగనీటి కాలువల్లో ఉన్న పైపుల ద్వారా మురుగునీరు లోపలికి ప్రవేశిస్తుంటాయి. ఈ నీరు దుర్వాసన వెద జల్లడమే కాక త్రాగటానికి కూడా పనికి రాకపోవడంతో అధిక శాతం ప్రజలు వాటర్ ప్లాంట్ల నుండి నీటిని కొనుగోలు చేసుకుని వినియోగించు కోవాల్సి న దుస్థితి ఏర్పడింది. గ్రామంలో త్రాగునీరు లభ్యమయ్యే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బోర్లు కూడా భూగర్భ జలాల్లో మార్పు రావడం అధికారుల నిర్లక్ష్యం కారణంగా అక్కడక్కడ మురుగునీరు పైపుల్లోనికి లీకై సరఫరా అవుతున్నాయి. దీని వలన ప్రజలు పంచాయతీ ద్వారా విడుదలయ్యే త్రాగునీటిపై ఆశలు వదులుకున్నారు. ఈ నీరు వాడుకో వడానికి తప్ప ఏ ఒక్కరు త్రాగే పరిస్థితి లేదు. డబ్బులు ఉన్నవారు నిత్యం ప్లాంట్ల నుండి నీటిని కొను గోలు చేసుకుంటుండగా కొంత మంది గ్రామానికి వెలుపల ఉన్న చేతిపంపుల ద్వారా నీటిని తెచ్చుకో వాల్సన పరిస్థితి నెలకొంది.



నిరుపయోగంగా వాటర్ ట్యాంకు

పుట్టగొడుగుల్లా వాటర్ ప్లాంట్

పంచాయతీలో రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకం ద్వారా సరైన త్రాగునీరు సరఫరా కాకపోవటంతో ప్రజలు మినరల్ వాటర్ ప్లాంట్ల పై ఆధారపడాల్సి వస్తుంది. ఎక్కడికి అక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల పుట్టుకొచ్చాయి. ఒక్క భట్టిప్రోలు గ్రామంలోనే దాదాపు 5 వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. ఈ వాటర్ ప్లాంట్లు కూడా 4 ప్లాంట్లు పోరంబోకు స్థలంలోనే పంచాయతీ అనుమతి కూడా లేకుండా ఏర్పాటు చేయటం గమనార్హం. కూరగాయల మార్కెట్లో ఉన్న మానేపల్లి వాటర్ ప్లాంట్ మాత్రం సొంత స్థలంలో ఉంది. వాటర్ ప్లాంట్ల నిర్మాణానికి ప్రభుత్వ అధికారుల నుండి నిర్వాహకులు ముందుగా అనుమతులు తీసుకోవాల్సి ఉంది. కానీ ఎక్కడ ఈ నిబంధనలు పాటించిన దాఖలాలు లేవు. సంబంధిత ఆర్డబ్ల్యూఎస్ అధికారులు కూడా మామూళ్ల మత్తులో మునిగి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఈ వాటర్ ప్లాంట్లపై ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని పేర్కొన్నారు.

పంచాయతీ ఆధ్వర్యంలోనే ప్లాంటు ఏర్పాటు చేయాలి

గ్రామపంచాయతీ అధికారులు ఇంటి పన్నులతోపాటు నీటి పన్నులు కూడా వసూలు చేస్తూ ఉంటారు. కానీ ఏ ఒక్కరూ ఈ పంచాయతీ విడుదల చేసే త్రాగునీటిని వినియోగించుకునే పరిస్థితి లేదు. అలాంటప్పుడు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పంచాయతీకి అనుబంధంగా ఉన్న షాపుల్లోనే వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా త్రాగునీటిని సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. దీని ద్వారా పంచాయతీకి ప్రజలు చెల్లిస్తున్న పన్నులకు న్యాయం జరిగినట్లు అవుతుందని భావిస్తున్నారు.



మాట్లాడుతున్న పృథ్వి లత


టిడిపి ప్రభుత్వంలోనే మహిళలకు రక్షణ

ప్రజాశక్తి - బాపట్ల

టిడిపి ప్రభుత్వంలోనే మహిళలకు రక్షణ ఉంటుందని తెలుగుదేశం బాపట్ల పార్ల మెంట్ మహిళ అధ్యక్షురాలు చందోలు పృధ్విలత అన్నారు. స్థానిక టిడిపి కార్యాల యంలో మహిళా విభాగం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అమె మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ చీరాల మండలం ఈపురుపాలెంలో సుచరితపై జరిగిన అత్యాచారం, హత్య ఘనపై ప్రభుత్వం వెంటనే స్పందించి హెూం మంత్రి వంగలపూడి అనిత ఈపురుపాలెం ఘటన స్థలాన్ని పరిశీలించి 48 గంటల్లోపు నిందితులను పట్టుకోవాలని పోలీసులను ఆదేశించారని అన్నారు. మహిళల సంరక్షణకు తాను అండగా ఉంటానని బాధిత కుటుంబానికి భరోసా కల్పించారని అన్నారు. బాపట్ల పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పల్లం సరోజిని మాట్లాడుతూ సుచరిత కుటుంబానికి ప్రభుత్వం తరపున తక్షణ సహాయం రూ.10 లక్షలు అందించి అండగా నిలిచిందని తెలిపారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ముద్దాయిలకు కఠిన శిక్ష పడే వరకు అధికారులు కృషి చేయాలని కోరారు. జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను హెూం మంత్రి వంగలపూడి అనిత నేతృత్వంలో పూర్తి స్థాయిలో నివారించేలా తెలుగుదేశం దిశా నిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు. మహిళలపై ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడినా ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో హైమావతి, రజిని, సంధ్య, దగ్గుమల్లి రాణి, వేమవరపు సుజాత, నాగభూషణమ్మ, నజ్మ, దుర్గ, విజయలక్ష్మి, సుబ్బలక్ష్మి, టిడిపి పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, విన్నకోట వీరయ్య నాయుడు, మందపాటి ఆంధ్రేయ, కుట్టుబోయిన రమేష్ పాల్గొన్నారు.

ఆదర్శ మహిళ..

- **అతి తక్కువ ధరకే అల్పాహారం, తినుబండరాల విక్రయం**
- **వృద్ధాప్యంలోనూ తన చేతనైన సాయం చేయాలనే లక్ష్యం**



70ఏళ్ల వయస్సులో అట్లు, ఇడ్లీ తయారు చేస్తున్న విజయలక్ష్మి

ప్రజాశక్తి - పర్చూరు

సొంత లాభం కొంత మానుకొని పొరుగువాడికి సాయపడవోయ్ అన్న గురజాడ మాటలకు ప్రత్యక్ష నిదర్శనం ఏడు పదుల వయసున్న కాకరపర్తి విజయలక్ష్మి. ఆమె ఆలోచన ఆదర్శం. ప్రతిరోజూ నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. కానీ ఆమె నిర్వహిస్తున్న చిన్నపాటి హెూల్‌లో మాత్రం ఎలాంటి ధరలు పెంచడంలేదు. పరిమాణం తగ్గించడంలేదు. తనకు వచ్చే ఆదాయం తగ్గించుకుని తక్కువ ధరకే అల్పాహారం, తినుబండరాలు ఇవ్వడం అందరినీ ఆకర్షించడమే కాక ఆలోచింపజేస్తున్నారు. తన భర్త మరణానంతరం పిల్లల్ని పెంచేందుకు టిఫిన్ హెూటల్ ప్రారంభించారు. అదే హెూటల్‌పై పిల్లల్ని పెంచి ప్రయోజకులను చేసినప్పటికీ తాను మాత్రం ఆ హెూటల్‌ను వదిలిపెట్టలేదు. తన చేతనైనంతో తక్కువ ధరకే అల్పాహారం ఇచ్చి ఇతరులకు సహాయపడాలనే ఆమె ఆలోచన అభినందనీయంగా ఉంది. చిన్న వయసులోనే భర్త పాపారావు అనారోగ్యంతో మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భర్త మరణంతో సంసారాన్ని ఎలా ఈదుకు రావాలనే తలంపుతో అద్దె ఇంట్లో చిన్న హెూటల్ ప్రారంభించారు. బతుకు బండి సాగించి పిల్లలను పెద్ద చేశారు. ఇద్దరు కుమార్తెలకు వివాహాలు జరిపించారు. ఈ చిన్న టిఫిన్ సెంటర్ మీద వచ్చే ఆదాయంతో కుమారుని వివాహం కూడా జరిపించారు. పిల్లలు ముగ్గురు ఎవరికి వారు జీవిస్తున్నారు. ఇదంతా ఈ చిన్న హెూటల్ మీద వచ్చే ఆదాయంతోనే జరిపించినట్లు వివరించారు. వృద్ధాప్యంలో ఇంకా ఎందుకు శ్రమపడుతున్నావని, తన వద్దకు రమ్మని కుమారుడు పిలిచిన ఒంట్లో ఓపిక ఉన్నన్నాళ్ళు కృషి చేయాలనే తలంపుతో పర్చూరులోని వాటర్ ప్లాంట్ రోటరీ గంగ సమీపంలో ఒక చిన్న అద్దె ఇంట్లో టిఫిన్ తయారు చేస్తూ జీవనం గడుపుతుంది. అతి తక్కువ ధరలకే నాణ్యంగా, రుచికరంగా, పరిమాణం తగ్గించకుండా టిఫిన్ అందజేయడం అందరినీ ఆకర్షిస్తున్నారు. రూ.10లకు నాలుగు ఇడ్లీ, రూ.5లకు దోశ ఇస్తున్నారు. ఇవే ఇడ్లీ, దోశ ఇతర హెూటల్లో అధిక ధరలు పలుకుతున్నాయి. ఇతర హెూటళ్లలో మూడు ఇడ్లీ రూ.20 కాగా దోశ రూ.25లు తీసుకుంటారు. తక్కువ ధరకే నాణ్యంగా ఎక్కువ పరిమాణంలో ఇలా ఇవ్వడం ఏమిటని ప్రజాశక్తి ఆమెను పలకరించింది. తాను పేద కుటుంబం నుంచి వచ్చానని, తనకన్నా నిరుపేదలకు ఆకలి తన చేతనైనంతలో తీర్చాలనే కోరితోనే తాను ఈ రేట్లకు ఇచ్చి తన పరిధిలో చేయగలిగిన సేవ చేస్తున్నట్లు వివరించారు. నేటి పోటీ ప్రపంచంలో వ్యాపారంలో లాభాపేక్షతో ఉండే వారే తప్ప విజయలక్ష్మి వంటి వాళ్లు అరుదుగా కనిపిస్తుంటారు. అతి తక్కువ లాభం తీసుకుని సేవ చేద్దామనే ఆలోచన ఉండే అతి తక్కువ మందిలో విజయలక్ష్మి ఒకరని చెప్పక తప్పదు. సొంత ఇల్లు కూడా లేదని, ప్రభుత్వం వారు ఇళ్ల స్థలం ఇచ్చి గృహ వసతి కల్పించాలని కోరారు.

చేతనైనంతలో సాయం చేయాలనేదే ఉద్దేశం

రోజుకు రూ.500లకు అమ్మకాలు చేస్తాను. ఖర్చులు పోను రూ.100 మిగులుతుంది. ఆ సంపాదనే సంతృప్తిని ఇస్తుంది. పనివాళ్ళు అవసరం లేదు. అన్ని పనులు నేనే చేసుకుంటాను. బీపీ, షుగర్ వంటి అనారోగ్య సమస్యలు లేవు. ఆరోగ్యంగా ఉన్నంతకాలం టిఫిన్ సెంటర్ కొనసాగిస్తాను. వచ్చే ఆదాయం తోనే సంతృప్తి చెందుతా. నాలుగు సంవత్సరాలు పాటు ప్రతి ఆదివారం ఉదయం తొమ్మిదిన్నర గంటల్లోపు 25 మంది పేదలకు టిఫిన్ ఉచితంగా ఇచ్చాను. ఇతర తినుబండారాలైన చక్రాలు, చెక్కలు, కారపు పూస తదితర వాటిని కూడా తయారు చేస్తాను. వాటినీ కేజీ రూ.220కి ఇస్తున్నా. వచ్చిన దానితో తృప్తి పడుతూ ఓపిక ఉన్నన్నాళ్ళు పేదలకు తక్కువ ధరలకే ఆహార పదార్థాలు ఇవ్వాలనేదే నా ఉద్దేశం.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - వేటపాలెం

చీరాల మండలం ఈపురుపాలెంలోని సీతానగరం చేనేత కుటుంబానికి చెందిన సుచరితపై అత్యాచారం, హత్యకు పాల్పడిన ముద్దాయిలను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్, ముస్లిం యూత్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ఆదివారం ర్యాలి నిర్వహించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ప్రభుత్వం, పోలీసులు వెంటనే స్పందించి దోషులను శిక్షించడం, బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షల పరిహారం ఇవ్వటం మంచి పరిణామమని అన్నారు. అయితే డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాలు అమ్మకాలు జరగడం వలన యువత తప్పుదారి పడుతున్నారని అన్నారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండ్ల బాబు, గుత్తి సదాశివరావు, దేవన గంగాధరరావు, ముస్లిం మైనారిటీ యువత సయ్యద్ ఖాదర్, షేక్ కరీం,షేక్ షఫీ, సయ్యద్ సుభాని, సద్దాం, జాకీర్, అక్రమ్, సోహెల్, సిద్దు, యజ్ఞమూర్తి పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత, ముస్లింలు



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - చీమకుర్తి

స్థానిక ప్రభుత్వం ఉన్నత పాఠశాల్లో 1985-86 పూర్వ విద్యార్థుల సమ్మేళం ఆదివారం ఘనంగా నిర్వహించారు. హాజరైన పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను నెమరు వేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సత్కరించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. ఈ సంధర్భంగా పూర్వ విద్యార్థులు సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. కార్యక్రమాలలో పూర్వ విద్యార్దులు మారంవెంకారెడ్డి, గొల్లపూడివెంకటరావు, బాశంశ్రీను, ముప్పూరిరంగారావు, గోపురపుశ్రీను, బక్కారత్నం, సుబ్బమ్మ, కోటమ్మ, రాజ్యలక్ష్మి, ధామస్, దుడ్డురంగరాయకులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆమంచి

ఈపూరుపాలెం ఘటన పాశవికం

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని ఈపూరుపాలెంలో యువతిని అత్యంత కిరాతకంగా ఆత్యాచారం ఆపై హత్య చేయడం దారుణమని మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. బాధిత యువతీ కుటుంబాన్ని ఆయన ఆదివారం పరామర్శించారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఈపూరుపాలెం వంటి ప్రశాంతమైన ప్రాంతంలో ఇటువంటి ఘటన జరగడం బాధాకరమని అన్నారు. బీహార్, ఉత్తరప్రదేశ్ వంటి ఈతరహా ఘటనలు చీరాలలో జరగడం దురదుష్టకరం అన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా నూతన ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గంజాయి, మాదక ద్రవ్యాలను అదుపు చేయడంలో ఆ శాఖ పనిచేయ లేదన్నారు. కూటమి ప్రభుత్వమైన గంజాయి, మత్తు పదార్థాల విషయంలో పూర్తి ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా నింధితులకు కఠిన శిక్షలు అమలు చేయాలని కోరారు. మృతి చెందిన యువతి చెల్లెలుకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎఎంసి మాజీ చైర్మన్లు మార్పు గ్రెగోరీ, డేటా జోసెఫ్, గోలి వెంకట్రావు, బలరామిరెడ్డి, మాజీ సర్పంచి గంజి వెంకటేశ్వర్లు, మల్లెల బుల్లి బాబు, పులిపాటి బాబురావు, దేవరపల్లి బాబురావు, కాటూరి వెంకటేశ్వర్లు, తిరువీధుల ధనుంజయ్, కె శివ, చుండూరి రవి, గరికపాటి సుధీర్, డేటా దివాకర్, ఎఎంసి మాజీ డైరెక్టర్ కనపర్తి బజ్జిబాబు, సిపిఐ నాయకులు బత్తుల శ్యాములు, సిపిఎం నాయకులు కొండయ్య ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - చీమకుర్తి

స్థానిక 33కెవి నందు నూతన విద్యుత్ లైను పనులు జరుగుతున్నందున సోమవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ ఏఈ వి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ఏలూరివారిపాలెం, కెవి పాలెం, గోనుగుంట, రామచంద్రా పురం, జివెల్ పురం, పిడతలపూడి, మర్రిపాలెం, ముప్వావారిపాలెం, బండ్లమూడి, పాటిమీదపాలెం, వై గుడిపాడు, టి గుడిపాడు, చీమకుర్తి నార్త్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆర్ఎల్‌పురం, చీమకుర్తి పరిశ్రమలకు విద్యుత్ అంతరాయం కల్గుతుందని తెలిపారు.

బాలినేని అక్రమాలపై విచారణ జరపాలి

జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి డిమాండ్

ప్రజాశక్తి- ఒంగోలు సబర్బన్

గత ఐదు సంవత్సరాల కాలంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చేసిన అవినీతి, అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక రంగా భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలినేని శ్రీనివాసరెడ్డి అనుచరులు భూ కబ్జాలు , దొంగ రిజిస్ట్రేషన్లతో నగరంలో భయానక వాతావరణాన్ని సృష్టించారన్నారు. వీటి పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. పోతురాజు కాలువ ఆధునీకరణ కోసం రూ.90 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు నిలిపివేసినట్లు తెలిపారు. నిర్మించిన సైడ్‌వాల్స్ వర్షాలకు కూలిపోయాయని తెలిపారు. పోతురాజుకాలువ అవకతవకలపై లోకాయుక్తాలో కేసు నమోదై విచారణ జరుగుతోందన్నారు. బాలినేని శ్రీనివాసరెడ్డి నిర్మిస్తున్న విల్లాల లెవలింగ్ కోసం అక్రమంగా కోట్లాది రూపాయల గ్రావెల్ తరలించినట్లు తెలిపారు. విల్లాల నిర్మాణంలో భాగంగా వాగు పోరంబోకు భూమిని ఆక్రమించినట్లు తెలిపారు. వీటన్నింటిమీద విచారణ జరపాలని కోరారు. ఈ సమావేశంలో ఒంగోలు సిటిజన్స్ అసోషియేషన్ అధ్యక్షుడు కొల్లా మధు, విశ్రాంత అడిషనల్ ఎస్‌పి సుంకర సాయిబాబు, ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, సుపరిపాలన వేదిక ఉపాధ్యక్షుడు డాక్టర్ కంచర్ల సుబ్బారావు, ప్రముఖ అడ్వకేట్ దేవకుమారి తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న లక్ష్మణరెడ్డి

ఉపాధి హామీ పనులు ప్రారంభించండి

డ్వామా పీడీకి వ్యవసాయ కార్మిక సంఘం నేతల వినతి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

గత 15 రోజులుగా నిలిచిపోయిన ఉపాధి హామీ పనులను వెంటనే ప్రారంభించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నెరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయంలో డ్వామా పీడీ బి. అర్జునరావును కలసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 4 నుంచి నేటి వరకు జిల్లా అంతటా ఉపాధి హామీ పనులు ఆగిపోయా యన్నారు. వ్యవసాయ పనులు పూర్తిగా లేని ఈ కాలంలో ఉపాధి హామీ పనుల మీదనే పేదలంతా ఆధారపడి జీవిస్తుంటారన్నారు. ప్రతి సంవత్సరం ఈ నెలలో రెండు లక్షల నుంచి మూడు లక్షల వరకు జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో గ్రామాలకు గ్రామాలే తరలి ఉపాధి హామీ పనులలో ఉండే వారిని తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం కొత్త ప్రభుత్వం రావటంతో క్షేత్రస్థాయిలో అధికారుల బదిలీలు ఇతర కారణాల వల్ల పనులు ఆగిపోయాయని తెలిపారు. వెంటనే జిల్లా అధికారులు చొరవ చేసి పనులు ప్రారంభించాలని కోరారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం వేతనదారులు పని కోరిన కాలంలో పని కల్పించకపోతే నిరుద్యోగ భతి ఇవ్వాల్సి ఉంటుందని, నిరుద్యోగ భతి ఇస్తారా? పని కల్పిస్తారా అని పీడీని వారు ప్రశ్నించారు. గత ఆరు వారాలుగా చేసిన పనికి వేతనాలు విడుదల కాలేదని, రెక్కల కష్టంపై ఆధారపడే కూలీలకు వేతనాలు సకాలంలో ఇవ్వక పోతే వారు ఎలా బతకాలని ప్రశ్నించారు. సమ్మర్ అలవెన్స్ కొనసాగించాలని, ప్రతి గ్రూపుకు టెంట్, మెడికల్ కిట్టు ఇవ్వాలన్నారు. మజ్జిగ మంచినీళ్ల పనిముట్లు పాత పద్ధతిలోనే ఇవ్వాలని కోరారు. వేతనదారులు పని ప్రదేశంలో ప్రమాదవశాస్తూ మరణిస్తే రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. ప్రతి కుటుంబానికి రెండు వందల రోజులు పని కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ అర్జునరావు మాట్లాడుతూ పనులు ఆగిన మాట వాస్తవమేనని సోమవారం నుంచి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు, మంత్రివర్గం చేసిన సూచనలు సలహాలు తీసుకుంటున్నామని, ఉపాధి పనిని పేదలకు మరింత చేరువయ్యేలా చేసేందుకు శక్తి మేరకు కషి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి బకాయిలు నెలాఖరు లోపు విడుదల అయ్యే అవకాశం ఉందని తెలిపారు.


డ్వామా పీడీ అర్జీ ఇస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నేతలు

వృద్ధులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు సంతపేటలోని శివం శరణాలయంలో దొంత శ్రీనివాసరావు ఆర్థిక సాయంతో వద్ధులకు నూతన దుస్తులు, పండ్లు ఒంగోలు పార్లమెంట్ నియోజక వర్గం తెలుగు మహిళా కార్యదర్శి మండువ లావణ్య అందజేశారు. ఈ సందర్భంగా జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లం రెడ్డి లక్ష్మణ రెడ్డి మాట్లాడుతూ శివం ఫౌండేషన్ స్థాపించి రెండేళ్లుగా ప్రతిరోజు ఒంగోలు నగరంలో అనాధలకు పేదలకు రోజూ అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగరాభివద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి, చిక్కాల కిరణ్ కుమార్, మాజీ కౌన్సిలర్ తన్నీరు సురేష్, దొంత శ్రీనివాస రావు మిత్రులు పాల్గొన్నారు.


దుస్తులు అందజేస్తున్న దాతలు

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

ప్రజాశక్తి- ఒంగోలు సబర్బన్

ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ వాలంటీర్ల శిక్షణా కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. సంస్థ లక్ష్యాలు సేవ మన స్వభావం కావాలి,సమాజసేవ ప్రతి ఒక్కరూ చేయాలనే తలంపుతో సభ్యులు మంగమూరు రోడ్డులో ఇంటింటికి వెళ్లి ప్లాస్టిక్ వినియోగాన్ని ఆపేయాలని ప్రజలను కోరారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. ప్లాస్టిక్ బదులు గుడ్డ సంచులు ఉపయోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ లివింగ్ శిక్షకులు క్రాంతి, ఎపెక్స్ బాడీ మెంబర్స్ రాజేంద్ర ప్రసాద్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వరహా లక్ష్మీనరసింహస్వామికి

పట్టు వస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాత శింగరాయకొండ శ్రీ వరహా లక్ష్మీనరసింహస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా కల్యాణ మహోత్సవంగా ఆదివారం వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర సాంఘిక సంక్షేమ, సచివాలయ వాలంటీర్ల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. తొలుత మంత్రి స్వామికి ఆలయ కమిటీ చైర్మన్ పామర్తి మాధవరావు, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఇఒ పి. కష్ణవేణి, తహశీల్దారు భవానీ శంకర్ ఘన స్వాగతం పలికారు. కల్యాణ మహోత్సవంలో మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, యన్నాబత్తిన వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ యన్నాబత్తిన అరుణచ పాత శింగరాయకొండ ఉపసర్పంచి నక్కా బ్రహ్మేశ్వర రావు దంపతులు, వేల్పుల సింగయ్య కోటేశ్వరమ్మ దంపతులు పాల్గొన్నారు. దేవస్థాన ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకట లక్ష్మీనరసింహచార్యులు ఆధ్వర్యంలో నరసింహస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీమకుర్తి కష్ణ, మించాల బ్రహ్మయ్య, గాలి హరిబాబు, సుదర్శి ప్రసాదరావు, శీలం చంటి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి స్వామి కి పూర్ణ కుంభం తో స్వాగతం

టంగుటూరు : జరుగుమల్లి మండలం దావగూడూరు గ్రామంలోని శ్రీచెన్న కేశవ స్వామి ఆలయ బ్రహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య ఆదివారం బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అర్చకులు వేద మంత్రాలతో పూర్ణ కుంభం, మేళతాళాలతో వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి చెన్నకేశవస్వామికి పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమలో ఆలయ ఇఒ రజనీ కుమారి, టిడిపి జరుగుమల్లి మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, దావగూడూరు మాజీ సర్పంచి చదలవాడ బ్రహ్మేంద్రం, దేవాలయ మాజీ చైర్మెన్ బత్తిన బ్రహ్మయ్య, నాయకులు దామచర్ల శ్రీనివాసరావు, నరాల సోమయ్య, బత్తి పూర్ణ, కొమ్మాలపాటి కృష్ణ, రావి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- బి.అమర్ నాయర్

ప్రాంతీయ రవాణా శాఖాధికారి

ముఖాముఖి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించ వచ్చునని మార్కాపురం ప్రాంతీయ రవాణాశాఖాధికారి అమర్ నాయక్ తెలిపారు. రహదారి నియమ నిబంధనలు పాటించకపోవడంతో ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు తరచూ ప్రమాదాలకు గురై ప్రాణ నష్టంతో పాటు ఆస్తి నష్టం జరుగుతుందన్నారు. అతివేగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోవడం, అజాగ్రత్తే అందుకు కారణమన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రవాణా శాఖ ద్వారా తీసుకుంటున్న చర్యలు గురించి మార్కాపురం ప్రాంతీయ రవాణా శాఖాధికారి అమర్ నాయక్ ప్రజాశక్తి ముఖా ముఖిలో వివరించారు. అవన్నీ ఆయన మాటాల్లోనే..



రవాణ శాఖ ద్వారా సేవలు..

వాహనాల రిజిస్ట్రేషన్. డ్రైవింగ్ లైసెన్స్‌లు మంజూరు చేస్తున్నారు. వాహనాల తనిఖీ, వాహనాల ఫిట్‌నెస్, పన్నులు వసూలు చేస్తునాడ్రు. రిజిస్ట్రేషన్ లేకున్నా, డ్రైవింగ్ లైసెన్స్ లేకున్నా అపరాధ రుసుం వసూలు చేస్తారు.

పత్రాలు ఉంటే వారి జోలికి పోం..

వాహన రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారి జోలికి పోము. పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తుంటారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అందుకే ఈ అంశాలపైనే ప్రధానంగా రవాణా శాఖ, పోలీస్ శాఖ అధికారులు తనిఖీలు చేస్తుంటారు. డీజీల్ ఆటోలైతే ఐదుగ్గురు, చిన్న ఆటో అయితే ముగ్గురు లేదా నలుగురు ప్రయాణికులను తీసుకెళ్లవచ్చు. అంతకు మించి తీసుకెళితే కేసు నమోదు చేస్తాం. అపరాధ రుసుం విధిస్తాం.

డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు ఇలా..

చాలా ఏళ్ల నుంచి ఇప్పటి వరకూ మ్యాన్‌వల్ పద్ధతిలోనే డ్రైవింగ్ లైసెన్స్ టెస్టు విధానాన్ని నిర్వహిస్తున్నాం. ఇందులో అధికారులు దగ్గరగా పరిశీలిస్తూ డ్రైవింగ్ నిబంధనలకు అను గుణంగా వాహనదారుడు నడిపాడని సంతృప్తి చెందితేనే అతనికి డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు చేసే పద్దతి ఇప్పటి వరకు ఉంది. ప్రస్తుతం ఉన్న మ్యాన్‌వల్ టెస్టింగ్ విధానం స్థానంలో కొత్తగా సాంకేతిక విధానాన్ని అమలు చేయాలని భారత, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించాయి. సరికొత్త మార్పులు తీసుకొస్తోంది. ఆటోమేషన్ డ్రైవింగ్ లైసెన్స్ టెస్టు విధానాన్ని ప్రవేశ పెట్టింది. ప్రస్తుతం దానికి సంబంధించిన పనులు దర్శిలో వేగవంతంగా జరుగుతున్నాయి.

ఆటోమేషన్ టెస్టు ఇలా..

డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు టెస్టింగ్ కోసం ప్రత్యేక డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌ను వివిధ నిర్దేశిత కేంద్రాల్లో సెన్సార్‌లు అమర్చి ఉంచుతారు. వీటితో పాటు ప్రత్యక్షంగా డ్రైవింగ్‌ను వీడియో కెమెరాల ద్వారా చిత్రీకరిస్తారు. డ్రైవింగ్ చేసే వాహనదారుడు రవాణా నిబంధనలు అతిక్రమించి నప్పుడు కెమెరా సెన్సార్‌లు దాన్ని గుర్తించి ఆటోమెటిక్‌గా సదరు వ్యక్తి ఫెయిల్ అయినట్లు ఫలితాన్ని ఆన్‌లైన్‌లో ప్రకటిస్తుంది. వాహనదారులు ఎక్కడ, ఏ తప్పు చేశాడో నిర్ధారిస్తూ వీడియో లింక్ సైతం వాహనదారుడి ఫోన్‌కు మెసేజ్ ద్వారా వెళ్తుంది. ఒకవేళ అన్ని విధానాలుగా సక్రమంగా వాహనాన్ని నడిపినట్లయితే ఫలితం పాస్ అయినట్లు మెసేజ్ వెళ్తుంది.

ఆటోమేషన్ ఉద్దేశం ఇదీ..

ఆటోమేషన్ డ్రైవింగ్ లెసెన్స్ టెస్టును ప్రవేశ పెట్టడానికి ప్రధాన కారణం ఇప్పటి వరకు రవాణ శాఖలో కొన్ని విమర్శలున్నాయి. మధ్యవర్తుల ప్రమేయం, జోక్యం లేకుండా డ్రైవింగ్ లైసెన్స్ మంజూరులో పారదర్శకతను పెంపొందించే దిశగా ఈ ప్రక్రియను ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

రోడ్డు భద్రత విషయంలో జాగ్రత్తలు..

రోడ్డు భద్రతకు సంబంధించి ఇప్పటికే డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి సారించాం. నిబంధనలకు విరుద్ధంగా మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తున్నాం. అతివేగంతో వాహనాలు నడిపే వారిపై లేజర్ గన్నుల ద్వారా వేగాన్ని పరిశీలించి జరిమానాలు విధిస్తున్నాం.